# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | E-mail:netinijam93@gmail.com


**నమ్మలేని నిజాలు**

పులుల జాడ
జనజీవనారణ్యం
ఉన్నవి చాలు.

జనం జాతర
నుమాయిష్ సమ్మోహనం
భాగ్యనగరం

దేవుడి గానం
సర్వజీవభజనం
కర్మోపదేశం

రువై ఆరు
శుభదినాల జోరు
జయాల తేరు

క్షేమ హాస్టళ్లు
అనారోగ్యకూడళ్లు
విద్యా వికాసం.

– రేడియమ్
సెల్: 9291527757



**శ్రీనిజాలు**

తెలంగాణ సాధించిన
ఉద్యమకారులెవరు ?
రాష్ట్రం వ్యతిరేకించిన
ఉద్యమ ద్రోహులెవరు ?
సారథ్యం చేసిరెవరు ?
వారికి వారేమికథ !
తెలంగాణ రాష్ట్రానికి
ఎవరు దీని జాతిపిత ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245




హైదరాబాద్ గురువారం 5-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:146 పేజీలు:6 వెల: రూ.1/-


## జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు జైషే ఉగ్రవాదుల హతం..

ఉదంపూర్, ఫిబ్రవరి 4: జమ్మూకశ్మీర్‌లోని ఉదంపూర్ జిల్లా అటవీ ప్రాంతంలో బుధవారం నాడు ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ ఎన్‌కౌంటర్‌లో పాక్‌కు చెందిన ఇద్దరు జైషే మమ్మద్ (ఏవఓ) ఉగ్రవాదులను భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. వీరిలో ఒకరిని ఈ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా చురుకుగా పనిచేస్తున్న 'జైషే' టాప్ కమాండర్ అవు మావియాగా, మరొకరిని జబ్బర్ అనే ఉగ్రవాదిగా గుర్తించినట్టు అధికారులు తెలిపారు. 'కియా' పేరుతో భద్రతా బలగాలు ఈ ఆపరేషన్ చేపట్టగా, ప్రస్తుతం ఎన్‌కౌంటర్ కొనసాగుతోంది.

అధికారుల సమాచారం ప్రకారం, జైషేకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులకు సంబంధించిన సమాచారం అందడంతో భద్రతా దళాలు, సీఆర్‌పీఎఫ్ బలగాలు గాలింపు చర్యలు చేపట్టాయి. మిలిటెంట్లు కాల్పులు జరుపుతూ అక్కడి నుంచి పారిపోయారు. నిఘా డ్రోన్ వారిని ఒక గుహలో దాక్కుకున్నట్టు గుర్తించడంతో భద్రతా బలగాలు చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో



ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు.

గుహ మొదట్లో ఒక ఉగ్రవాది, గుహలోపల మరొక ఉగ్రవాది మృతదేహాలను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. వారి నుంచి ఒక ఎం–4 కార్బైన్, ఒక ఏకే–47 రైఫిల్, మరికొన్ని ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

## మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన రద్దు..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 4: మణిపూర్‌లో రాష్ట్రపతి పాలనను రద్దు చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము బుధవారం నాడు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆ రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమమైంది. రాజ్యాంగంలోని 356వ అధికరణలోని క్లాజ్ (2) ద్వారా తనకు సంక్రమించిన అధికారాలతో 2025 ఫిబ్రవరి 13న మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధిస్తూ జారీ చేసిన ఆదేశాలను రద్దు చేస్తున్నట్టు రాష్ట్రపతి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2026 ఫిబ్రవరి 4వ తేదీ నుంచి తక్షణమే ఈ ఆదేశాలు అమల్లోకి వచ్చినట్టు తెలిపారు.

జాతుల మధ్య ఘర్షణలతో మణిపూర్ అట్టుడకడంతో ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ గతేడాది రాజీనామా చేశారు. దీంతో తొలుత 6 నెలలపాటు అక్కడ రాష్ట్రపతి పాలన విధించి మరోసారి దానిని పొడిగించారు. ఈ క్రమంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు కేంద్రం చేపట్టిన సన్నాహకాల్లో భాగంగా బీజేపీ రాష్ట్ర శాసనసభా పక్ష నేతగా యుమునాం ఖేమ్‌చంద్ సింగ్‌ను ఆ పార్టీ ఎమ్మెల్యేలు మంగళవారం నాడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో 62 ఏళ్ల ఖేమ్‌చంద్ మణిపూర్ కొత్త ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మణిపూర్ రాజకీయాల్లో బీజేపీ కీలక నేతగా ఖేమ్‌చంద్ పేరు తెచ్చుకున్నారు. 2017, 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఇంఫాల్ వెస్ట్‌లోని సింజమి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2017 మార్చి నుంచి 2022 మార్చి వరకూ మణిపూర్ అసెంబ్లీ స్పీకర్‌గా పని చేశారు. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ సాధించడంతో బీరేన్ సింగ్ ప్రభుత్వంలో రెండోసారి క్యాబినెట్ మంత్రిగా సింగ్ నియమితుల య్యారు. మున్సిపల్ పాలనా వ్యవహారాలు, హౌసింగ్ డెవలప్ మెంట్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్, విద్యా శాఖలను నిర్వహించారు. 2025 ఫిబ్రవరిలో మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేంత వరకూ ఆ పదవులను ఆయన సమర్ధవంతంగా నిర్వహించారు.

## లోక్‌సభ మళ్లీ వాయిదా..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 04: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. బడ్జెట్‌పై రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే క్రమంలో సభలో తీవ్ర గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దాంతో బుధవారం సైతం సభ పలుమార్లు వాయిదా పడింది. ఈరోజు ఉదయం సభ ప్రారంభమైన వెంటనే భారత్ – అమెరికా వాణిజ్య ఒప్పందంపై చర్చి జరగాలంటూ విపక్ష పార్టీల సభ్యులు పట్టుబట్టారు.

దీంతో సభలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. దాంతో మధ్యాహ్నం 12.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.

విపక్ష సభ్యులంతా పార్లమెంట్ మెట్ల మీదకు చేరుకుని.. ప్లకార్డులు పట్టుకుని నిరసనకు దిగారు. ఈ సందర్భంగా మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఇక పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విలేకర్లతో మాట్లాడుతూ.. లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ రాసిన లేఖకు తాము సమాధానం ఇచ్చామన్నారు. కానీ ఆయన ఏకపక్షంగా మాట్లాడుతున్నారంటూ రాహుల్ తీరుపై కిరణ్ రిజిజు మండిపడ్డారు. సభ 12.00 గంటలకు ప్రారంభమైంది.

సభలో సభ్యుల తీరు మారలేదు. భారత్, అమెరికా ఒప్పందంపై కేంద్ర వాణిజ్యం, పరిశ్రమల శాఖ మంత్రి పియూష్ గోయల్ మధ్యాహ్నం 2.00 గంటలకు సభలో సమాధానం ఇస్తారని ప్రకటించిన అనంతరం సభను వాయిదా వేశారు. మళ్లీ సభ ప్రారంభమైన అనంతరం భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై సభలో మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడారు. విపక్ష సభ్యులు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. ప్లకార్డులు ప్రదర్శించారు. దాంతో సాయంత్రం 5.00 గంటలకు సభను వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. మరోవైపు రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ప్రధాని నరేంద్ర మోదీ ఈ రోజు అంటే.. బుధవారం లోక్‌సభలో ధన్యవాదాలు తెలపనున్నారు.

లోక్‌సభ లో ఈ రోజు ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. ఇంకోవైపు ప్రధాని సభకు వస్తే.. ఆర్మీ మాజీ చీఫ్ నరవణె రాసిన పుస్తకాన్ని ఆయనకు తాను స్వయంగా అందజేస్తానని రాహుల్ గాంధీ ప్రకటించారు. ఆ పుస్తకాన్ని పార్లమెంట్ ఆవరణలో రాహుల్ గాంధీ ప్రదర్శించారు.

ప్రధాని మోదీ భయపడ్డారని.. ఈ రోజు ఆయన సభకు రారంటూ రాహుల్ గాంధీ జోస్యం చెప్పారు. నరవణె పుస్తకంలోని అంశాలపై చర్చించాలంటూ మంగళవారం నాడు లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పట్టుబట్టారు.

ఆయనకు మద్దతుగా 8మంది ఎంపీలు స్పీకర్ ఎదుట నిరసనకు దిగారు. ఆ క్రమంలో కాగితాలను చించి స్పీకర్‌పైకి వారు విసిరారు. ఈ నేపథ్యంలో సదరు ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది.

**చురక**

తెలంగాణ సాధించిన
తెగువొక్కడి సొత్తుకాదు
సకలజనం పోరాడిన
చరితెప్పుడు చిత్తుకాదు.
జాతిపిత అంటూ తనను
జపంచేసే స్వంత ఘనులు
ఏత్యాగం చేయకుండా
ఎట్లవుతడు అడిగే జనులు




–వేల్పుల నారాయణ
9440433475

**రాధశ్రీ రాగాలు**

నిన్న దివ్య స్మృతి
రేపు ఊహా స్థితి
నేడు చింతల చితి
అనును రాధశ్రీ !!
కన్ను తెరచిన పుట్టు
కన్ను మూసిన గిట్టు
ఆశ ఆయువు పట్టు
అనును రాధశ్రీ !!



–రాధశ్రీ
సెల్:9494481210



## కోఠి కాల్పుల కేసు.. యూపీకి హైదరాబాద్ పోలీసులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 4: హైదరాబాద్‌లోని కోఠి ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్ వద్ద జరిగిన కాల్పులు, దోపిడీ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసులో పోలీసులు కీలక ఆధారాలను సేకరిస్తున్నారు. గత నెల 31న ఉదయం నగదు జమ చేసేందుకు వచ్చిన రిన్షద్ అనే వ్యక్తిపై దుండగులు తుపాకీతో కాల్పులు జరిపి ఆరు లక్షల నగదును దోచుకుని పారిపోయారు. పోలీసులకు దొరక్కుండా ఉండేందుకు నిందితులు ఆటోల్లో చక్కర్లు కొట్టి, చివరకు చాంద్రాయణగుట్ట, బార్కస్ ప్రాంతాల్లో తలదాచుకున్నట్లు సమాచారం అందింది. అయితే మరుసటి రోజే వారిద్దరూ ఉత్తరప్రదేశ్‌కు పరారైనట్లు తెలుస్తోంది.

ఇద్దరు నిందితుల్లో ఒకరికి హైదరాబాద్‌లో ఇంతకుముందు నేర చరిత్ర ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. కొద్ది రోజుల క్రితమే యూపీ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన ఈ నిందితులు.. బార్కస్ ప్రాంతంలో మకాం వేసినట్లు తెలుస్తోంది. నగరంలో ఉన్న స్థానికులు కొందరు ఈ దుండగులకు ఆశ్రయం ఇచ్చి సహకరించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. సహకారం అందించిన వ్యక్తుల కోసం ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో పాతబస్తీ ప్రాంతంలో ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. అతడు నిందితులకు షెల్టర్ ఇచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆరు లక్షల నగదుతో బ్యాగ్‌ను తీసుకుని హైదరాబాద్ నుంచి యూపీ వెళ్లిన నిందితులను పట్టుకోవడానికి.. హైదరాబాద్ పోలీసులు యూపీలో కూడా గాలింపు చేపట్టారు. నాలుగు రోజులుగా నిరంతరం గాలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం, నిందితుడు పాత నేరస్థుడు కావడంతో యూపీ పోలీసుల సహకారంతో ఆపరేషన్‌ను ముమ్మరం చేశారు. నిందితులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

## రైల్వే స్టేషన్‌లో బ్రిడ్జి పైనుంచి దూకిన వ్యక్తి.. రైలుపై పడి విద్యుదాఘాతంతో మృతి

కోల్‌కతా, ఫిబ్రవరి 4: రైల్వే స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పై నుంచి ఒక వ్యక్తి దూకాడు. స్టేషన్‌కు చేరుకున్న రైలుపై పడి విద్యుదాఘాతంతో మరణించాడు. ఈ సంఘటనతో ఆ మార్గంలో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఫిబ్రవరి 3న రాత్రి 7.30 గంటల సమయంలో బల్లిగంజ్ స్టేషన్‌లోని ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి ఒక వ్యక్తి కిందకు దూకాడు. రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకోవాలని భావించాడు.

కాగా, అదే సమయంలో ఒక లోకల్ రైలు స్టేషన్‌కు చేరుకున్నది.

ఈ నేపథ్యంలో ఫుట్‌ఓవర్ బ్రిడ్జి పైనుంచి దూకిన ఆ వ్యక్తి లోకల్ రైలుపై పడ్డాడు. ఓవర్‌హెడ్ హైటెన్షన్ విద్యుత్ వైర్లలో చిక్కుకున్నాడు. విద్యుదాఘాతానికి గురై మరణించాడు. రైలుపై మంటల్లో కాలిపోయాడు.

## ఉగాది రోజున ఘనంగా గద్దర్ అవార్డుల ప్రదానం: డిప్యూటీ సీఎం



హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలుగు సినీ పరిశ్రమకు తెలంగాణ ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఈరోజు (బుధవారం) సచివాలయంలో గద్దర్ అవార్డుల జ్యూరీ సభ్యులతో డిప్యూటీ సీఎం కీలక సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌ను ఫిల్మ్ ఇండస్ట్రీకి కేంద్రంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. అన్ని భాషల సినీ పరిశ్రమలు ఇక్కడికి విస్తరించేలా అనుకూల వాతావరణం కల్పిస్తామన్నారు. దీని ద్వారా సినీ రంగంలో యువత, టెక్నీషియన్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సినీ ప్రపంచ మార్కెట్‌కు హైదరాబాద్ కేంద్రంగా మారుతుందని వెల్లడించారు.

కళల ద్వారా సమాజానికి తన జీవితాన్ని అర్పించిన మహానుభావుడు ప్రజా గాయకుడు గద్దర్ అని అన్నారు. అందుకే గద్దర్ పేరు మీద సినిమా అవార్డులను ప్రారంభించి సినీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రతిభ, పారదర్శకత ఆధారంగానే అవార్డులు ఇవ్వాలని జ్యూరీ సభ్యులకు సూచించారు. ఉగాది రోజు మార్చి 19న ఘనంగా అవార్డుల పంపిణీ జరగనుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫిబ్రవరి 6 నుంచి గద్దర్ అవార్డుల స్క్రీనింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

## చందానగర్‌లో భారీగా గంజాయి పట్టివేత

కొండాపూర్, ఫిబ్రవరి 4 : ఒడిషా నుంచి హైదరాబాద్‌కు గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 39 కేజీల గంజాయిని చందానగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. .మహారాష్ట్ర కొల్లాపూర్‌కు చెందిన శివ, రాహుల్ శరత్ సొంతూరులో సెకండ్ హ్యాండ్ కార్ల అమ్మకం చేస్తున్నారు. ఈజీ మనీ కోసం గంజాయి అమ్మాలని ప్లాన్ వేసుకుని, ఈ క్రమంలో భువనేశ్వర్ వెళ్లి 39 కేజీల గంజాయి కొనుగోలు చేసారు.

హైదరాబాద్‌లో అమ్మేందుకు భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కి ట్రైన్ లో బయలుదేరారు. సమాచారం అందుకున్న శేరిలింగంపల్లి ఎస్‌ఓటి పోలీసులు లింగంపల్లి రైల్వే స్టేషనులో కాపుకాసి శివ, రాహుల్‌లను అదుపులోకి తీసుకుని, వారి నుంచి 39 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు.

పట్టుకున్న గంజాయి విలువ రూ.19.50 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## పాట ద్వారా ప్రజలను చైతన్యపరిచిన గద్దర్



అవార్డుల ప్రదానోత్సవంలో సముద్రాల వేణుగోపాలచారి, వెన్నెల తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4: పాట ద్వారా ప్రజలను చైతన్యం చేసిన గద్దర్ ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోతారని మాజీ కేంద్ర మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి అన్నారు. ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్, పుడమి సాహితీ వేదిక సంస్థల ఆధ్వర్యంలో నాంపల్లి సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గద్దర్ స్ఫూర్తి పురస్కారాల ప్రదానోత్సవం జనవరి 29న ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వేణుగోపాలాచారి ప్రసంగిస్తూ తెలంగాణ ఉద్యమంలో పాటతో ప్రజలలో ధైర్యం నింపారని అన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ డాక్టర్ జి.వి.వెన్నెల ఇండో కెనెడియన్ యూత్ కౌన్సిల్ అధ్యక్షులు రొయ్యూరు శేషసాయి, టీటీడీ బోర్డు సభ్యులు దారావత్ బాల్‌సన్, పారిశ్రామికవేత్త డాక్టర్ యామిని ఉప్పల్‌రావు, సామాజికవేత్త గొల్లమందల దానయ్య తదితరులు పాల్గొన్నారు. పుడమి సాహితీవేదిక చైర్మన్ చిలుముల బాల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో విభిన్న రంగాలలో కృషి చేస్తున్న 18 మందిని గద్దర్ పురస్కారాలతో సత్కరించారు. డాక్టర్ అద్దంకి రాజాయోనా నిర్వహణలో కార్యక్రమం జరిగింది.

## రచయిత్రి భవానీదేవికి 'సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారం' ప్రదానం



డా॥భవానీదేవికి 'సుశీలా నారాయణరెడ్డి సాహితీ పురస్కారం'తో సత్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4: సమాజాన్ని ప్రభావితం చేసిన సంగీత, సాహిత్యాలని హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సామాన్య ప్రజలకు చేరువ చేసే సంగీతం, సాహిత్యం ఈ రెండు శాశ్వతంగా ఈ భూమ్మీద నిలిచే ఉంటాయని ఆయన చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై రసమయి సాంస్కృతిక సంస్థ సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జనవరి 29న సుశీలానారాయణ రెడ్డి సాహితీ పురస్కార ప్రదానోత్సవ సభను నిర్వహించారు. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బండారు దత్తాత్రేయ రచయిత్రి డా॥ భవానీదేవికి **'సుశీలా నారాయణ రెడ్డి సాహితీ పురస్కారం'** ప్రదానం చేశారు. అనంతరం దత్తాత్రేయ మాట్లాడుతూ.. సినారె మరణించినా ఆయన రాసిన సినీ పాటలు,గేయ రూపకాలు ప్రజల హృదయాల్లో నేటికీ నిలిచే ఉన్నాయన్నారు. ఆయన సాహితీ వారసత్వం కొనసాగించేలా సుశీలా నారాయణరెడ్డి పేరిట అవార్డ్ నలభై మూడు ఏళ్ళుగా రచయిత్రులకు బహుకరించటం విశేషమన్నారు.

భవానీదేవి రచనలు సమాజాన్ని మేల్కొపుతాయని చెప్తూ రచయిత్రి భవానీదేవిని ఆయన సభాముఖంగా అభినందించారు. సభకు అధ్యక్షత వహించిన తెలంగాణ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ.. నలభై మూడు ఏళ్ళుగా రచయిత్రులకు అవార్డు ఇస్తున్న ఒకే ఒక్క సంస్థ సుశీల నారాయణ రెడ్డి ట్రస్ట్ అని చెప్పారు.

సాహితీవేత్త జె. చెన్నయ్య పురస్కార గ్రహీత భవానీదేవిని పరిచయంచేస్తూ తెలుగు సాహితీ రంగంలో బహు ప్రక్రియల ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. పురస్కార గ్రహీత భవానీదేవి స్పందన ప్రసంగం చేస్తూ సామాజిక దృష్టితో తాను రచనలు చేస్తున్నానన్నారు. డాక్టర్ ఎం.కె.రాము స్వాగతం పలికిన వేదికపై కళారాదకుడు నరసింహప్ప, సినారె మనమరాలు మనస్విని తదితరులు పాల్గొన్నారు. తొలుత ఆశాలత వ్యాఖ్యానంలో రామాచారి శిష్యబృందం సినారె గీతాలు మధురంగా ఆలపించారు.

## అచ్చమైన తెలంగాణ కవి మోతుకూరి అశోక్ కుమార్

### –'మెలకువ తీరం' పుస్తకావిష్కరణలో ప్రముఖ కవి డా॥ నందిని సిధారెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ పల్లె నుడికారాలు, అస్తిత్వ భాష, పలుకుబడులను ఒడిసిపట్టి మనిషి జీవితంలోని విభిన్న పార్శ్వాలు, యాంత్రిక దృశ్యాలను కవిత్వంగా మార్చి అశోక్ కుమార్ 'మెలకువ తీరం'లో అందించడం గొప్ప విషయమని తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షుడు డా॥ నందిని సిధారెడ్డి అన్నారు. తెలంగాణ రచయితల సంఘం (తెరసం) జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం కామారెడ్డి సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో కవి మోతుకురి అశోక్ కుమార్ రాసిన 'మెలకువ తీరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా॥ నందిని సిధారెడ్డి హాజరై మాట్లాడారు.

సభాధ్యక్షులు నాళేశ్వరం శంకర్ మాట్లాడుతూ అశోక్ కవిత్వం ప్రజలలో సామాజిక స్పృహను, ప్రగతిశీల చైతన్యాన్ని మేలు కొలపుతుందని, రంగుల తోట అనే కవిత ఇందులోని కవితలకు మేనిఫెస్టో లాంటిదని కొనియాడారు. మెలకువ తీరం పుస్తకం పరిచయం చేసిన



'మెలకువ తీరం' పుస్తకావిష్కరణలో అతిథులు

ప్రముఖ కవి, తెలంగాణ రచయితల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వి శంకర్ మాట్లాడుతూ ఇందులోని కవితల నేపథ్యం, కవి దృక్పథం గురించి వివరించారు. తెలంగాణ పల్లె ఆత్మను పట్టుకొని ఇక్కడి యాసను, భాషను చక్కని శిల్పంతో చిత్రించారు అన్నారు. ఆత్మీయ అతిథి తెరసం జంటనగరాల అధ్యక్షుడు కందుకూరి శ్రీరాములు, ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్, కవులు సిహెచ్ ప్రకాశ్, సిరిగాద శంకర్, గారు పెరుముల కైలాస్, వడ్ల రమేష్, సాయిలు, టి పి టి ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు అనిల్ కుమార్, జిల్లా అధ్యక్షులు చింతల లింగం, అంజయ్య సి. ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

తెరసం కామారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రుద్రంగి రమేశ్ , సుప్పని సత్యనారాయణలు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# నేటి నిజం సాహితీ కెరటాలు

E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com




## సుంకాల మోత!

ఒకే గూడు కింద ప్రపంచం
ఓ మధుర స్వప్నం.
కానీ ప్రస్తుతం వినిపిస్తోంది
సుంకాల మోత
అభివృద్ధి చెందిన ఒక అగ్ర దేశం
స్వార్థ ఘోష!
ప్రపంచీకరణ నేపథ్యంలో
ఎల్లలు లేని వర్తకం అన్నారు
ఆర్థిక పరంగా..
ఎత్తుపల్లాల గోడలు కడుతున్నారు
వ్యాపార యుద్ధానికి తెరలేపుతున్నారు
ఇదెక్కడి న్యాయం?.

సమృద్ధి ఉన్నచోట సంతృప్తి లేదు
లేమి ఉన్నచోట
సుంకానికి మినహాయింపు లేదు
అభివృద్ధి ముసుగులో
అహంకారపు అడ్డుకట్టలు
పైసపైన స్వేచ్ఛా ఉచ్చారణలు
లోపల మాత్రం సుంకాల కోటలు
ఇది ప్రపంచీకరణా? లేక
ఆధునిక అంటరానితనం ముసుగులో
పరస్పర విద్వేశీకరణా?

ఒక దేశపు కన్నీరు
మరో దేశపు పన్నీరు కావాలా?
సుంకాల అంకెల గారడీలో
నిత్యం నలిగిపోతున్నది
ఒక సామాన్యుడి కొనుగోలు శక్తి.
దేశాల మధ్య సరిహద్దులు
చెరిపేయాల్సింది పోయి
సుంకాల పేరిట
ముళ్ల కంచెలు వేయడమేనా
నేటి నాగరికత?
తాత్వికత లోపించిన
వర్తకం ఆత్మ లేని శరీరం


స్వార్థం నిండిన సుంకం
ప్రపంచ ప్రగతికి ఉరితాడు
లోకమంతా ఒకటే అనుకున్నప్పుడు
అభివృద్ధి వెలుగులు
అన్ని దేశాలపై ప్రసరించకూడదా?
దేశాల సమతుల్యతను
కాపాడే దిశలోఇప్పటికైనా
ఈ సుంకాల మోత ఆగిపోవాలి
సమ భావాల రాగం
ఆలపించాలి!



**-ఆచార్య కడారు వీరారెడ్డి**
9392447007

"గంగా తరంగాలు"లో

# ప్రేరణాత్మక కవితలు




**ప్రతులకు:**
గంగా జమున దడివె,
16-5-4/5 పోలీస్ స్టేషన్ ఎదురుగా, పోచమ్మ టెంపుల్ ఎదురుగామోర్తాడ్,
నిజామాబాద్-503 225.

కవిత్వం పరమార్థం ఏమిటి? ఈ ప్రశ్న మన గంగా జమున మస్తిష్కంలో ఎందుకు ఉదయించిందో తెలియదు గానీ, **'కవిత ఎందుకు?'** అన్న రచనలో తన మనో భావాలను తెలియజేసింది. కవిత్వం ధర్మాన్ని ధైర్యంగా తెలుపడానికి, సమాజ హితానికి అంటూ తెల్ల కాగితానికి అనంత శక్తినిస్తూ, ప్రజల్లో విజ్ఞానం పెంపొందిందా అంటుంది ఈ యువ కవయిత్రి. మరో కవిత **'అవినీతిపై అక్షర యుద్ధం'**లో రవికాంచని చోటు కవి గాంచును అభివృద్ధికి అడ్డుగల అవినీతిని అక్షరం ఎరుగును, ఎండగట్టును అంటూ అక్ష రం అవినీతి మీద అలుపెరుగని పోరాటం చేస్తూ సమాజ వారధి కావాలంది. మేలుకో అన్న కవితలో యువతకు దురలవాట్లకు దూ రంగా ఉండి నైతిక విలువలతో సాగమంది.

నా ఉనికిని నాకు తెలిపింది నీ స్నేహం, ధైర్యం చెప్పింది, నా మాటలకు ప్రాణం పోసింది నీవే అంటూ తన నేస్తాన్ని గుర్తు చేసుకున్న తీరు బాగుంది. సమాజమా నన్ను రక్షించుమంటూ రాసిన కవితలో భరించే భర్త దూరమై, సమాజం చిన్న చూపు చూస్తుంటే, తన తప్పు లేకుండా ఎందుకీ సమాజం ఇలా చేస్తుందంటూ నిలదీసింది. భర్త పోవడం తనకు శాపమైందనీ, ముత్తైదువుతనం కోల్పోవడం నా పాపమాయె, ఉదయాన్నే నా మొహం చూస్తే అపశకునం మంటిరి, అందరి సూటిపోటి మాటలు భరించి విసిగిపోయాను, అంటూనే ధైర్యంగా వెంటనే భూదేవంత ఓపికతో భరిస్తాను, భగీరథుడంత పట్టుదలతో నెగ్గుకొస్తాను అంటూ సమాజమా నన్ను రక్షించుమా అంటూ కవితను అల్లింది. **'నాలో నేను'** కవితలో గంగా జమున స్త్రీ జాతికి ఆత్మ విశ్వాసాన్ని పెంచే ప్రయత్నం చేస్తానన్నారు. ఏదైనా మితంగా వుంటేనే మంచిదన్న విషయాన్ని గుర్తు చేస్తూ, హద్దుమీరి అతి వాగితే తెచ్చేను తంటాలు అని చెబుతూ సోషల్ మీడియాను కూడా మితంగా వాడాలన్నారు. **'ఊపిరి'** అన్న కవితలో ఈ రచయిత్రి అసలు సిసలైన ఒక తెలుగు గృహిణిని ఆవిష్కరించింది. భర్త, ఎడారి ఎండ మా వెంట, పనికై పయణం సాగించి, భవన నిర్మాణంలో రెక్కలు ముక్కలు చేసుకొని, ఖర్జూర పండు తింటూ ఎలా కాలం వెళ్ళ తీస్తున్నావో అంటూ ఎంతో వ్యధ చెందుతుంది. అయితే తన మధుర క్షణాలను గుర్తు చేసుకుంటూ నీ ఊపిరిలో ఊపిరై నీలో నేనుండి పోనా అంటుంది. ఎంత బావుందో ఈ భావన. అక్షరం అభివృద్ధికి నాంది అన్న సందేశాన్ని పలు కవితల్లో కవయిత్రి ప్రాముఖ్యంగా అక్షరీకరించింది. మానవాభ్యుదయం, సమాజ శ్రేయస్సు ప్రాధాన్యంగా గంగాజమున రచనలు ఈ పుస్తకం నిండా మనకు కనిపిస్తాయి. కంటికి రెప్పలా కాపాడిన అమ్మా నాన్నలే తనను నడిపించే దైవాలన్నారు. ఆమె అన్న రచనలో మహిల మహోన్నతమైన పడతి అనీ సృష్టికి ఆధారమనీ, తనకు తానే ఆదర్శంగా నిలుస్తోందంటూ గొప్పగా తీర్చుకోలేనిది అంటుంది మరో కవిత, **'అమ్మ అమృత** వల్లి'లో.

కవితలన్నీ చదివిన తర్వాత గంగా తరంగాలు కవయిత్రి మొదటి పుస్తకం అంటే నమ్మబుద్ధి కాదు మరి. కవితల్లో సమసమాజ చైతన్యం అనుబంధాలూ, ఆత్మీయతలూ, సామాజిక అంశాలూ అక్షరాలుగా పుస్తక రూపం దాల్చాయి. అంతరిక్షంలో అడుగిడినా మారదు ఆడపిల్ల జీవితం అంటూ ఇంకా ఎంతో మార్పు రావాలి మహిళల జీవితాల్లో అంటూన్న గంగా జమున మేలు కొలుపుగా పని చేస్తుంది. ఈమె కవితలు ప్రేరణ కలిగిస్తాయి నిజంగా. ఇది సాహిత్య భవానీ సాహిత్య వేదిక వారి ప్రచురణ.



**- డా॥ పులివర్తి కృష్ణమూర్తి**
9949092761

## విశ్వ విజేత స్త్రీ

ఒక స్త్రీ అబలగా కాక
సబలగా ఉందంటే..
దౌర్జన్యాన్ని ఎదురొడ్డి
మహిళా సాధికారతకు
ప్రతీకగా నిలిచిందంటే..
సమాజంలో జరుగుతున్న
దుర్మార్గాలను నిలదీస్తూ
పది మందికి
ఆదర్శంగా ఉందంటే..
ఆమెను ఖచ్చితంగా
పరాశక్తితోనే పోలుస్తాము..
అలాంటి వారిలో మనం
ముఖ్యంగా చెప్పుకోవాల్సింది..
నరకాసురుని
వధించిన సత్యభామ..
అవమాన భారానికి తలవంచక
కౌరవుల అంతుచూసిన ద్రౌపది.
పాతివ్రత్య మహిమతో
త్రిమూర్తులని
పసిబాలురగా మార్చిన
అనసూయ
వీరందరూ వీరనాయికలే.
చరిత్రలో ఝాన్సీలక్ష్మీ,
రుద్రమదేవి
వంటి ఎందరో మహిళలు
పురుషులతో సమానంగా
శౌర్యం ప్రదర్శించి..
గొప్ప స్త్రీ మూర్తులుగా
నీరాజనాలు అందుకుంటున్నారు.
ఆధునిక కాలంలో ఆ సంఖ్య
మరింతగానే పెరిగింది
ఇప్పుడు..
వంటింటి కుందేలు నుంచి
ఇంట్లో యజమానురాలు..
ఆఫీసులో బాసు..
కలెక్టరు..ఎస్పీ..
ఎమ్మెల్యే..ఎంపి..
జవాను..డాక్టర్..
పురుషాధిక్య సమాజంలో
స్త్రీ ఎన్నో విషయాల్లో
ముందు వరసలో ఉంటుంది
ఒకనాడు ఇంటా..బయటా
స్వేచ్ఛ లేని ఆడది
ఇప్పుడు
అన్ని రంగాల్లో దూసుకుపోతూ
ప్రపంచం అభివృద్ధిలో
తన వంతుగా
ప్రధాన పాత్ర పోషిస్తోంది..
నిన్నటి నెలత..
నేటి విశ్వవిజేత..
నిజానికి ప్రతి విజయం
మహిళదే..
పురుషుని విజయం వెనక
మహిళ నిన్నటి మాట..
పురుషునిపై విజయం
నేటి మహిళ బాట..
తాను గెలుస్తూ..
భర్తను గెలిపిస్తూ..
ఇంట్లో..బయట..
నిజమైన నాయిక..స్త్రీ..!
ఆమె అమ్మయినా..ఆలైనా..
చెల్లయినా..బాసైనా..
రోడ్డున ఎదురుపడే
అపరిచితురాలైనా..
చులకన చేయకు ఆడదాన్ని..
గౌరవించు స్త్రీ మూర్తిని..
ఈ జగతికి కీర్తిని..!



**-విశ్వైక**
9550183143



జనవరి 27న కళా సుబ్బారావు కళావేదికలో "ఫణి భార్గవ్ యాది...." కార్యక్రమంలో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించిన నాట్య గురువు శ్రీమతి సుష్మ ఉదయ మహంతి శిష్య బృందంతో అతిథులు, ఏ. సురేందర్, శ్రీమతి సుష్మ డా॥ ఏనుగు నరసింహాసుడ్డి, బైస దేవదాసు, డా॥కె.వి.రమణాచారి, డా॥యం.కె.రాము, కళా జనార్ధనమూర్తి.

# అర్థవంతంగా జీవించడమే జీవిత పరమార్థం




'తెలుగు జాతికి భూషణాలు' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్య నాయుడు, కె.పద్మనాభయ్య, డా॥కె.వి.రమణాచారి, ఓలేటి పార్వతీశం, కిన్నెర రఘురాం తదితరులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 4: అర్థవంతంగా జీవించడమే జీవిత పరమార్థమని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు అన్నారు. ప్రస్తుతం సమాజంలో స్వార్థం, అవివేకం, అజ్ఞానం సమ్మిళితమైన కొంతమంది పక్కదోవ పడుతున్న ఉదంతాలు కనిపిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతరత్న పద్మ పురస్కారాలు అందుకున్న తెలుగు వారి జీవిత విశేషాలతో రేవూరు అనంత పద్మనాభరావు రాసిన తెలుగు జాతికి భూషణాలు పుస్తకాన్ని గురువారం బొగ్గులకుంట తెలంగాణ సార స్వత పరిషత్ సభా మందిరంలో వెంకయ్యనా యుడు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహనీయుల జీవితాలను పిల్లలకు పరిచయం చేయా లని తల్లిదండ్రులకు సూచించారు. అనంత పద్మనా భరావు తనకు చిన్ననాటి నుంచి సుపరిచితులని, ఒకే గురువు దగ్గర చదువుకున్నట్లు వెంకయ్య గుర్తు చేసుకున్నారు. కేంద్ర హోం శాఖ మాజీ కార్యదర్శి కె. పద్మనాభయ్య, తెలంగాణ ప్రభుత్వ మాజీ సలహాదారు కేవీ రమణాచారి, సాహితీవేత్త వోలేటి పార్వతీశం, కిన్నెర రఘు రామ్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష

# 'అక్షర సేనాధిపతి' జీవిత చిత్రణ




తెలుగు సాహిత్య రంగంలో కొత్తగా పరిచయం అవసరం లేని పేరు దాస్యం సేనాధిపతి గారిది. వివిధ ప్రక్రియలలో 16 గ్రంథాలను వెలువరించి, సాహిత్య రంగంలో అందె వేసిన చేయిగా నిరూపించుకున్నారు. వీటిలో కవిత్వం, కథలు, విమ ర్శ, లేఖా సాహిత్యం మొదలైనవి ఉండడం విశేషం. వందలాది కవితలు, వందకు పైగా గ్రంథా లకు పీఠికలు, యాభైకి పైగా కథలు, పదిహేను వందలకు పైగా గ్రంథాలకు సమీక్షలు రాసిన కలం వారిది. అంతేకా కుండా ఎనిమిది పత్రికల కు కాలమిస్టుగా వ్యవహరించారు. ఇరవైకి పైగా గ్రంథాలకు సంపాదకత్వ బాధ్యతలు నిర్వహించారు. వందల కొద్ది సాహిత్య సభల్లో అతిథిగా ఆయా సభల2ు విజయవంతం అయ్యేందుకు దోహదపడ్డ గళం వారిది. ఎన్నో పురస్కారాలు పొందిన దాస్యం సేనాధిపతి వివిధ సాహిత్య సంస్థల అభివృద్ధికి ఇతోధికంగా కృషి చేశారు. కొన్ని సంస్థల వ్యవస్థాపనలో కీలక భూమిక నిర్వహించారు. మరికొన్ని సంస్థల్లో ముఖ్య కార్యనిర్వాహకుడిగా ఉన్నారు.

పైన పేర్కొన్నదంతా నాణే నికి ఒకవైపే. మరో వైపూ దాస్యం సేనాధిపతికి గొప్ప జీవితానుభవాలు ఉన్నాయి. విద్యారంగంలో నిరుపమాన కృషీవలుడాయన. ప్రైవేటు రంగంలో తొలిదశలో సరస్వతీ విద్యామందిరాల పర్యవేక్షక అధికారిగా పనిచేసిన ఆయన ప్రభుత్వ రంగంలోనూ విశ్వవిద్యాలయ స్థాయి అధికారిగా పని చేశారు. ఉపన్యాసకుడిగా, డిగ్రీ కళాశాల ఎఫ్.ఎ.సి. ప్రధానాచార్యుడిగా, న్యాక్ కమిటీ సమన్వయకర్తగా, ఎన్. ఎన్. ఎన్. ప్రోగ్రాం అధికారిగా, కామర్స్ విభాగాధిపతిగా, శాతవాహన విశ్వవిద్యాలయ పరీక్షల అదనపు కంట్రోలర్ గా, ఇందిరాగాంధీ సార్వత్రిక విశ్వవిద్యాలయ అధ్యయన కేంద్ర సమన్వయకర్తగా, కళాశాల విద్యా కమిషనరేట్ అకడమిక్ ఆడిటర్ గా ఎన్నో బాధ్యతలను నిర్వహించి, ప్రముఖుల ప్రశంసలు పొందారు. ఉత్తమ అధ్యాపకుడిగా, ఉత్తమ అధికారిగా మంచి పేరు గడించారు.

బహుముఖీనంగా విద్యారంగంలోనూ సాహిత్య రంగంలోనూ సేవలందించిన దాస్యం సేనాధిపతి సప్తతి సందర్భంగా వెలువరించిన గ్రంథం 'అక్షరగీతం'. ఈ అక్షర సేనాధిపతి జీవిత చిత్రణ గ్రంథమిది. ప్రముఖ కవి, రచయిత దాస్యం లక్ష్మయ్య ఈ గ్రంథానికి ప్రధాన సంపాదకులుగా వ్యవహరించారు. ప్రముఖ కవయిత్రులు సావిత్రీ రంజోల్కర్, మూర్తి శ్రీదేవి సంపాదకత్వం వహించారు. దాస్యం సేనాధిపతి తమ తల్లిదండ్రులు కీ.శే. దాస్యం శాంతాదేవి, వెంకటస్వామిలకు ఈ గ్రంథాన్ని అంకితమిచ్చారు. తమ అత్తామామలు తూప్రాన్ ఆండాలమ్మ, కిష్టయ్యల సంస్మరణలో ఈ గ్రంథాన్ని వెలువరిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ గ్రంథం దాస్యం జీవితానికి, వ్యక్తిత్వంలోని వివిధ కోణాలకు అద్దం పడుతుంది. ఈ గ్రంథం కోసం 300 మంది ప్రముఖులు ఎంతో అభిమానంతో అభిప్రాయాలను రాశారంటేనే ఆయనది ఎంత అరుదైన వ్యక్తిత్వమో తెలుస్తుంది. ఆ 300 మందిలో మంత్రులు, మాజీ మంత్రులు, వైస్ ఛాన్సలర్లు, ఆచార్యులు, అధికారులు, సాహిత్య ప్రముఖులు, పూర్వ విద్యార్థులు, బంధుమిత్రులు ఉండడం విశేషం. ఆయా అభిప్రాయాలను చదివితే దాస్యం సేనాధిపతి ఎంతో గొప్ప వ్యక్తో తెలుస్తుంది.

"దాస్యం సేనాధిపతి మహోన్నత జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కలిగి తెలుగు సాహితీ క్షేత్రంలో వివిధ ప్రక్రియలలో విలువైన పుస్తకాలను వెలువరించి, అసమాన సాహిత్య సృజన చేయడమే కాకుండా వేలాది గ్రంథాలను సద్విమర్శనా కోణంలో సాహితీ లోకానికి పరిచయం చేసి, అనుపమాన కేతనం ఎగురవేశార"ని తమ సంపాదకీయంలో దాస్యం లక్ష్మయ్య పేర్కొన్నారు.

"అక్షరాధిపతిగా వెలుగొందుతున్న దాస్యం సేనాధిపతి వివిధ ప్రక్రియలలో వెలువరించిన పుస్తకాలపై ఈ గ్రంథంలో కొలువు దీరిన వ్యాసాలు విశ్లేషణాత్మకంగా ఉన్నాయ"ని గ్రంథ సంపాదక బాధ్యత నిర్వహించిన ప్రముఖ కవయిత్రి సావిత్రీ రంజోల్కర్ వివరించారు. ''దాస్యం గారితో అనుబంధం, పరిచయం ఉన్న అనేక మంది భిన్న ప్రక్రియలలో ఈ గ్రంథంలో రాయడం వల్ల వివిధ దృక్కోణాలలో దాస్యం గారి వ్యక్తిత్వం, సాహిత్యం వాస్తవా నుభూతులతో చక్కగా ఆవిష్కృత మైంద''ని సంపాదకుల్లో ఒకరైన మూర్తి శ్రీదేవి తమ ముందుమాట 'హృద యావిష్కరణ'లో అభిప్రాయపడ్డారు.

"అక్షరాన్ని ఆయుధంగా, భావాన్ని బ్రతుకుగా మార్చిన దాస్యం సేనాధిపతి కలం నిస్వార్థ సేవకు ప్రతీక" అని ఈ గ్రంథానికి అభినందన సందేశం పంపించిన పూర్వ కేంద్ర మంత్రి, మహారాష్ట్ర పూర్వ గవర్నర్ సిహెచ్. విద్యాసాగర్ రావు పేర్కొనడం దాస్యం సేవానిరతికి అద్దం పడుతుంది. మౌనంతోనూ మాటతోనూ సమర్థవంతంగా దాస్యం పని చేసే తీరును విద్యాసాగర్ రావు వివరించడం పాఠకులను ఆకర్షిస్తుంది. "వాక్చాతుర్యంతో మంత్రించగలగడమే మాత్రమే కాదు- మౌనంగా మార్గనిర్దేశం చేయగల శక్తి ఆయనది'' అంటారు విద్యాసాగర్ రావు.

వృత్తి రీత్యా, ప్రవృత్తి రీత్యా ఎన్నో బాధ్యతలు నిర్వహించిన దాస్యం సేనాధిపతి ప్రతి చోటా తన ప్రభావాన్ని చూపగలిగారు. తన ప్రత్యేకత నిరూపించగలిగారు. ఇదే విషయాన్ని 'క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ వెరసి దాస్యం సేనాధిపతి' అనే శీర్షికన పంపిన అభినందన సందేశంలో కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ పేర్కొంటారు. "దాస్యం గారి సాహిత్యము, జీవితం వేరువేరుగా ఉండకుండా వారి సాహిత్యాన్ని చదివితే వారి జీవితాన్ని చదివినట్లుగానే అనిపిస్తుంద''ని ఆయన తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

దాస్యం సేనాధిపతి తొలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ పనిచేశారు. ఈ విషయాన్ని తమ శుభాకాంక్షల సందేశంలో వివరించారు ఆయన బాల్య మిత్రుడు, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్. కవిత్వ రూపసార విశ్లేషణతో కూడిన 'దిక్సూచి' అనే గ్రంథాన్ని వెలువరించారు దాస్యం సేనాధిపతి. ఆ గ్రంథంలో "కవిత్వ భావన ఎలా ప్రకటింపబడాలి, ఔచిత్యాన్ని ఎంతవరకు పాటించాలి, పదబంధ ప్రయోగాలు కవిత్వంలో ఎలా ఉండాలి? వీటన్నిటి మీద సాధికారికంగా, క్లుప్తంగా, సుందరంగా విపులీకరించి విడమరిచార''ని దాస్యం సేనాధిపతిని ప్రశంసించారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు, రిటైర్డ్ ఐ.ఎ.ఎస్. అధికారి డా.కె.వి. రమణాచారి.

తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, పూర్వ ఉపకులపతులు సైతం దాస్యం సాహిత్య ప్రస్థానంపై అమూల్యమైన అభిప్రాయాలను వెలిబుచ్చారు. "శబ్దలయ తెలిసి, అక్షరం సాక్షిగా జీవించిన కవి''గా దాస్యం సేనాధిపతిని పేర్కొంటారు తెలుగు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య వెలుదండ నిత్యానందరావు. "దాస్యం సేనాధిపతి కవితాదివిటీని పట్టి సాహితీవనంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని పదిలం చేసుకున్నారు" అంటారు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య సూర్యా ధనంజయ్. "అతనొక జీవన గాథ, విలువల కళాశాల, అనుభవాల సముద్రం, నిత్యసాహితీ వనమాలి. అవార్డులు, రివార్డులు, నిర్వహించిన ప్రస్థానాలు, అధిరోహించిన పదవులు వారి నిబద్ధతకు నిదర్శనాలు'' అన్న అభిప్రాయం దాస్యంపై శాతవాహన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులు ఆచార్య యు. ఉమేశ్ కుమార్ ది. అదే విశ్వవిద్యాలయ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కడారు వీరారెడ్డి కూడా ఇదే విధమైన అభిప్రాయాన్ని సవివరంగా వ్యక్తం చేయడాన్ని చూడవచ్చు. అప్రమత్తత, ఆత్మీయత, సమన్వయం, విలక్షణత్వం, అంకితభావం మేళవించిన పరీక్షల అదనపు కంట్రోలర్ గా దాస్యం పనితీరును చిత్రిక పట్టారు వీరారెడ్డి.

బహుముఖీనంగా విద్యారంగంలోనూ సాహిత్య రంగంలోనూ సేవలందించిన దాస్యం సేనాధిపతి సప్తతి సందర్భంగా వెలువరించిన గ్రంథం 'అక్షరగీతం'. ఈ అక్షర సేనాధిపతి జీవిత చిత్రణ గ్రంథమిది.

"సాహిత్య కార్యకలాపాల్లో సతతం మునిగితేలే అక్షర స్థపతి దాస్యం సేనాధిపతి. రచయిత, కవి, ఉపన్యాసకుడు, కార్యదక్షుడు, స్నేహపాత్రుడు సేనాధిపతి" అంటారు 'సేనాధిపతికి స్నేహాభినందన' అనే వ్యాసంలో తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి. దాస్యం సేనాధిపతికున్న నిరంతర అధ్యయన పటిమ వల్లే ఆయన రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సృజనకారుడిగా రాణిస్తున్నారని పేర్కొన్నారు కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత డా. నలిమెల భాస్కర్.

ప్రభుత్వ ఉద్యోగంలోకి ప్రవేశించే ముందు సరస్వతీ విద్యాపీఠంలో పర్యవేక్షక బాధ్యతలు నిర్వహించారు దాస్యం సేనాధిపతి. ఆరోజుల్లో శఠగోపం లక్ష్మీనరసింహాచార్యుల మార్గదర్శనంలో చిలకమారి సంజీవ, బెల్లంకొండ మల్లారెడ్డి, కోటంరాజు, గటిక సుదర్శన్ తదితరులతో పాటు ఉత్తమ సేవలందించారు దాస్యం వారు. ఈ విషయాలన్నీ తమ అభిప్రాయంలో గుర్తు చేసుకున్నారు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలతో కూడిన దక్షిణ మధ్య ప్రాంతంలో విద్యాభారతి సంస్థ సేవా సంయోజక్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న కుందూరు విద్వాన్ రెడ్డి. ప్రశిక్షణావర్గలతో పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణలో దాస్యం పోషించిన అమూల్యమైన పాత్రను ఆయన వివరించారు. "సాహిత్యంతో సంబంధంలేని కామర్స్ బోధనా పాఠ్యాంశాలు చెప్తూ రెండువేల పుస్తకాలను సమీక్షించడం ద్వారా ఆయన సాహిత్య జిజ్ఞాస, అధ్యయనానుభవం ఎంత గొప్పవో వెల్లడవుతోంద"ని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ తొలి ఛైర్మన్ బీఎస్ రాములు అభిప్రాయపడ్డారు.

సేనాధిపతిని ఉద్దేశించి "అతడొక సేనాధిపతి/ సాహితీ సమరాంగాణ ఛత్రపతి/ అక్షరాల అక్షయ తూణీరం ఆయన ఆయుధ సంపతి'' అని కవితారూపంలో ప్రశంసల చిరుజల్లు కురిపించారు తెలంగాణ రాష్ట్ర అధికార భాషాసంఘం పూర్వ అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి. "ప్రక్రియలపై, వివిధ వాదాలపై రాగద్వేషాలు విస్తరించి, తెలుగు భాషా సాహిత్యాలు వికాసం దిశలో కాక ప్రతికూల దిశలో పయనిస్తున్న ఈ సందర్భంలో సహృదయ సార్వభౌముల ఆవశ్యకత ఏర్పడింది'' అంటూ ఆ కొరతను దాస్యం సేనాధిపతి తీరుస్తున్నారని పేర్కొన్నారు ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి.

నవతరం కవులను ప్రోత్సహిస్తూ, జూనియర్ కవుల రచనలపై కూడా సమీక్షలు రాసిన దొడ్డ మనసు ఉన్న సమీక్షకుడిగా దాస్యం సేనాధిపతి కృషిని వివరించారు తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహారెడ్డి. సాహిత్యానికి, సౌజన్యానికి మారుపేరుగా దాస్యంను చూపించారు జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల సంయుక్త కార్యదర్శి జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్. దాస్యం సేనాధిపతి సప్తతి సందర్భంగా రూపొందించిన ప్రత్యేక సంచిక 'అక్షరగీతం' దాస్యం రచనావైభవాన్ని, జీవన ప్రస్థానాన్ని, సాహిత్యానుభవాన్ని ఆవిష్కరించే అద్భుత సంచికగా రూపొందిందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు సాహిత్య అకాడమి కార్యదర్శి డా. నామోజు బాలాచారి.

సేనాధిపతిని కవనసేనాధిపతిగా పేర్కొన్న ప్రసిద్ధ సినీగేయ రచయిత భువనచంద్ర అభిప్రాయం అక్షరసత్యం. "తన సాటి కవుల కవితలలోనూ తన తరువాతి తరం యువ కవితలలోనూ తొలుత రసాన్వేషణ చేసి, సాహితీ భవితవ్యంలోకి రాచబాటలు చూపే దారిదీపం లాంటి విమర్శనా కలం -గళం తనది' అంటూ దాస్యం సేనాధిపతి సమీక్షల తీరుతెన్నులను విపులీకరించారు ప్రసిద్ధ సినీగేయ రచయిత సుద్దాల అశోక్ తేజ. "బియ్యంలో రాళ్లు, రప్పలు ఏరి వండిన అన్నం ఎలా ఉంటుందో దాస్యం రాసిన పుస్తక సమీక్ష కూడా అలాగే ఉంటుంద"ని దాస్యం సమీక్షల తీరును వివరించారు 'నేటినిజం' సంపాదకులు బైసా దేవదాసు. "పది పేజీల పుస్తకమైనా వెయ్యి పేజీల పుస్తకమైనా ప్రతి పుటలోని అక్షరాన్ని తడిమి చూసి అందులోని సారాన్ని క్లుప్తంగా అందించగల శక్తియుక్తులు గల నేర్పరి" గా దాస్యంను పేర్కొన్నారాయన.

దాస్యం కవిత్వరచనా శైలిని వివరించారు కాళోజీ పురస్కార గ్రహీత డా. అమ్మంగి వేణుగోపాల్. "సరళమైన భాష, అనుభూతి, సంపన్నమైన భావ వ్యక్తీకరణ అందరినీ ఆకట్టుకుంటాయి. అంతేకాదు. వారి కవిత్వం ఎప్పుడూ సమకాలీనంగా ఉంటూ, కొత్తదనంతో తేజరిల్లుతూ ఉంటుంది. ఈ లక్షణాల వల్ల వారి కవిత్వానికి గాఢత చేకూరుతుందని చెప్పవచ్చు" అంటారు.

ఈ ప్రత్యేక సంచికలో సుప్రసిద్ధ కవి ఆచార్య సి. నారాయణరెడ్డి గారి అభిప్రాయాన్ని కూడా చేర్చడం సముచితంగా ఉంది. "ఏ అంశాన్ని తీసుకున్నా ఆర్ద్రంగా అభివ్యక్తీకరించడం దాస్యం సేనాధిపతి మౌలిక సృజనాత్మక ప్రవృత్తికి నిదర్శనం'' అన్న నారాయణరెడ్డి అభిప్రాయానికి ఉదాహరణగా ఎన్నో చక్కటి కవితలను నేటికీ రాస్తూ వస్తున్నారు దాస్యం సేనాధిపతి.

దాస్యం సేనాధిపతి రాసిన గ్రంథాలపై నారాయణశర్మ, డా. సూర్యప్రకాశ్ రావు, అన్నాడి గజేందర్ రెడ్డి, వారాల ఆనంద్, డా॥ పోరెడ్డి రంగయ్య, డా. కాలువ మల్లయ్య తదితరులు రాసిన వ్యాసాలు కూడా ఈ ప్రత్యేక సంచికలో ఉండడం ఈ సంచిక విలువను మరింత పెంచింది. 'అక్షరగీతం' గ్రంథం కోసం వచ్చిన అభిప్రాయాలు, వ్యాసాలు చాలా అమూల్యమైనవి. ఈ సంచికలో కనబడని సాహితీ వేత్తలు దాదాపు లేరనే చెప్పుకోవచ్చు.


అంతా భారీ సంఖ్యలో సాహిత్య ప్రముఖులు ఈ 'అక్షరగీతం' గ్రంథం కోసం తమ రచనలను అందజేశారు. అంతేకాకుండా దాస్యం సేనాధిపతి మిత్రులు, బంధువులు కూడా తమ అబిప్రాయాలను పంచుకున్నారు. వీటి క్రోడీకరణ, సంపాదకత్వం ఒక బృహత్తర కార్యం. వీటన్నిటినీ సేకరించడం, ఒక క్రమంలో అమర్చడం, ఎడిటింగ్ చేయడం మొదలైన పనులను సమర్థవంతంగా నిర్వహించింది సంపాదక బృందం.

చాలా శ్రమకోర్చి ఈ పనిని నెరవేర్చిన ప్రధాన సంపాదకులు శ్రీదాస్యం లక్ష్మయ్య గారికి, సంపాదకులు సావిత్రీ రంజోల్కర్ గారికి, మూర్తి శ్రీదేవి గారికి అభినందనలు. విలువైన దాస్యం జీవిత ఛాయాచిత్రాలు, మనవరాలు సాన్వి గీసిన చిత్రాలు ఈ గ్రంథానికి ప్రత్యేక ఆకర్షణ.

దాస్యం సేనాధిపతితో మౌనశ్రీ మల్లిక్, మూర్తి శ్రీదేవి చేసిన ఇంటర్వ్యూలను ఈ గ్రంథంలో చేర్చారు. దాస్యం బయోడేటాను కూడా క్లుప్తంగా అందజేశారు.

ఈ కారణంగా సేనాధిపతి గురించి తెలియని ఎన్నో విషయాలు తెలుస్తాయి.

ఈ సాహిత్య కృషి కనీసం మరో ముప్పయ్యేళ్లకుపైగా సాగి, శతకవీరుడిగా దాస్యం నిలవాలని ఆకాంక్ష. నిలుస్తారని ధీమా.



**-డా. రాయారావు సూర్యప్రకాశ్ రావు**
9441046839

# అత్యాశ (కథ)

"చాయ్ తాగుదం పా" అన్నడు అమర్.

"నాతాన ఏకానే వుందిరా. నీ దెగ్గెరుంటే తాగుదం" అన్నడు కిషన్. 'ఉన్నయి పా, నీ ఏకానా నీ దెగ్గెరే ఉంచుకో' అనుకుంటు కిషన్ చెయ్యి పట్టుకొని ఈరానీ హొటల్లకు గుంజుకొ పొయ్యిండు అమర్.

అక్కడ చాయ్ దొవ్వానా!

"ఏక్ చాయ్ ఔర్ ఖాలీ కప్ లేకే ఆవో" అన్నడు అమర్.

బేరర్ ఒక పెద్ద కప్పుల చాయ్ మల్ల ఒక్క ఖాలీ కప్పు తీస్కొని వొచ్చిండు. దోస్తులిద్దరు ముచ్చట్లాడుకుంట ఒక్కట్ల సగం సగం చేసి చాయ్ తాగిన్రు.

అమర్, కిషన్ ఇద్దరు క్లాస్‌మేట్స్. ఒకే స్కూల్ల సద్వుకున్నరు. అమర్ ఊరికెల్లి వొచ్చి పట్నంల వుండి సద్వుకున్నడు. కిషన్‌ది సొంతూరు పట్నమే. వాళ్లింటి దగ్గర్నె కిషన్ వాండ్ల ఇల్లు. ఇద్దరిండ్లు దగ్గరుండబట్టి శాలెకు కల్సెపొయ్యేటోళ్లు. కల్సె వచ్చేటోళ్లు. అమర్



అన్న దగ్గరుండి సద్వుకునేటోడు. కిషన్ వాండ్ల నాయ్నది చిల్లర దుక్నం. ఇంటి కాడనే నడిపేటోడు. కిషన్ సైకిలు మీద సామాన్లు తెచ్చి తండ్రికిచ్చేటోడు. సామాన్లు ఎక్కువ ఉన్నప్పుడు తోడుగ అమర్‌ని ఎంబడి తీస్కొపొయ్యేటోడు. గిట్ల వొకరి పన్లల్ల ఇంకొకరు సాయం జేస్కునేటోళ్లు. అమర్ ఇంట్లగాని వాండ్ల సుట్టాలింట్లగాని ఏ దావతయినా కిషన్ ఎంట తీస్కొనిపొయ్యేటోడు. గట్లనే కిషన్ వాండ్లింట్లగానీ, వాండ్ల సుట్టాలింట్లగానీ ఏ దావతయినా అమర్ పొయ్యేటోడు. గిట్ల కిషన్, అమర్‌లిద్దరు ఒకరింట్ల ఒకరు సొంత కులపోల్లెక్క కల్సిపొయ్యి తిర్గేటోళ్ళు.

ఇద్దరు మెట్రిక్ పాసయ్యిన్రు. పైసల్లేక ఇద్దరు ప్రైవేట్ నౌకరీలల్ల చేరిన్రు. గట్లనే రోజూ పిల్లల ఇండ్లకే ఎల్లి ట్యూషన్‌లు చెప్పేటోళ్ళు. ట్యూషన్ చెప్పే టైంలకే కిషన్ ఓ పిల్లతోని ప్రేమలపడ్డడు. గా పిల్లదేమో వేరే కులం. వాళ్లింట్ల పెండ్లికి ఒప్పుకోలేదు. మీద్కెల్లి గాయ్నకు సొంతిల్లు లేదు. మంచి కొల్వు లేదు. గప్పట్సంది గాయ్నకు ఎట్లగన్న సరే పైస సంపాదించి సొంతిల్లు కొనుక్కొన్నంకనే పెండ్లి చేస్కోవాలనుకున్నడు. చిట్టీల ధంద ఇద్దరు కల్సి మొదలుపెట్టిన్రు. యాడాది రెండేండ్లల్లనే పదివేలు సంపాదించిండు. ఐదువేలు అమరిచ్చిండు. రెండు వేలు అప్పుచేసి పట్నంల పదారువేలకు ఇల్లు కొన్నడు. పెండ్లికి వాళ్ళ సుట్టాలెవ్వరు రాలేదు. కాని అమర్ సుట్టాలే నిలబడి పెండ్లి సేసిన్రు.

పెండ్లి అయ్యింది మొదలు ఇంకా ఇంకా పైస సంపాదించాలన్న ఆపేచ్చ

> **"ఇద్దరు మెట్రిక్ పాసయ్యిన్రు. పైసల్లేక ఇద్దరు ప్రైవేట్ నౌకరీలల్ల చేరిన్రు. గట్లనే రోజూ పిల్లల ఇండ్లకే ఎల్లి ట్యూషన్‌లు చెప్పేటోళ్ళు. ట్యూషన్ చెప్పే టైంలకే కిషన్ ఓ పిల్లతోని ప్రేమలపడ్డడు. గా పిల్లదేమో వేరే కులం. వాళ్లింట్ల పెండ్లికి ఒప్పుకోలేదు. మీద్కెల్లి గాయ్నకు సొంతిల్లు లేదు. మంచి కొల్వు లేదు. గప్పట్సంది గాయ్నకు ఎట్లగన్న సరే పైస సంపాదించి సొంతిల్లు కొనుక్కొన్నంకనే పెండ్లి చేస్కోవాలనుకున్నడు."**

ఎక్కువయ్యింది. రాత్రింబగలు గాయ్నకు పైస పైస అనే ద్యాస తప్ప వేరే ఉండేది కాదు. చిట్టీల పైసలు ఎత్తినోళ్ళింటికి పొయ్యి నిలబడి వసూలు చేసేటోడు. వొసూలు చేసేటప్పుడు సుట్టాలు, దోస్తులు అనే తేడా లేకుండా వొసూలుచేసేటోడు. గాయ్న గునం అమర్‌కు నచ్చేది కాదు. గందుకే గా చిట్టీల దంద ఇడ్సిపెట్టి "నువ్వొక్కడివే చేస్కో" అని చెప్పి వేరుబడ్డడు. గప్పట్సంది గాయ్న ఒక్కడే చిట్టీలు నడిపేటోడు. ధంద వేలలకెల్లి లచ్చలకు పొయ్యింది. గింతల్నె గాయ్నకు సర్కారి కొలువొచ్చింది. కొల్వు సేస్కుంటనే చిట్టీలు నడిపేటోడు. అమర్‌కు కూడ సర్కారి నౌకరీ టీచర్‌గొచ్చింది. గాయ్న పంతులు నౌకరీ చేస్కుంట మరదల్ని పెండ్లి సేస్కొని సంసారం చెయ్యసాగిండు. కాలం గడుస్తపొయ్యింది. కిషన్ తాన పైస జమ కాసాగింది. ముందుగాల సైకిలు తీసేసి స్కూటర్ కొన్నడు. గటెన్కల ప్రేమించిన పిల్లతోని పెండ్లి అయ్యింది. రోజూ లెవ్వంగనే పైసల వసూలుకు పొయ్యొచ్చి బిర బిర తిని టిఫిన్ కట్టుకొని కొలువుకు పొయ్యేటోడు. మల్ల పొద్దుమీకి డ్యూటి దిగినంక, మెంబర్ల దెగ్గర్కెల్లి పైసలు వొసూలు చేస్కుంట రాత్రి తొమ్మిందిటికి ఇంటికి చేరేటోడు. గింతల్నె ఇద్దరు మొగపిల్లలు పుట్టిన్రు. పెద్దగయ్యిన్రు. సాలెకు పోసాగిన్రు.

కాని కిషన్ ఇంట్ల పెండ్లాం పిల్లల్ని పెద్దగ పట్టిచ్చుకునేటోడు కాదు. పిల్లలు పదో తరగతి పాసయ్యిన్రు. పిల్లలెప్పుడు తల్లి దిక్కునే మాట్లాడేటోళ్ళు.

ఏ పెండ్లామయిన ఎంతకాలం మొగ్గణ్ణి భరిస్తుంది. ఒకరోజు గామె పిల్లల్ని తీస్కొని వెరుబడ్డది. అతను ఒక్కడే ఉండబట్టిండు. గామె ఫారీఖాతులు తీస్కున్నది. ఇగ చేసేది లేక ఇంకో పెండ్లి సేస్కున్నడు. కొంతకాలం బాగానె ఉన్నడు. అయినా పైస సంపాయించాలెనన్న యావ సావ లేదు. రెండు మూడు ఇండ్లు కొన్నడు. కార్లు కొన్నడు. బంగారం జమ జేసిండు. కాని తృప్తిగా బతికేటోడు కాదు.

ఎప్పుడైనా ఏ గుడికైనా పోతే కొబ్బరికాయ కూడా కొట్టేటోడు కాదు. బిచ్చగాండ్లకు దానం చేసేటోడు కాదు.

రెండో పెండ్లాంకు పుట్టిన పిల్లలు పెరిగి పెద్దగయిన్రు. సద్వుకో సాగిన్రు. ఈన శాతలకు యాష్టపడి రెండో పెండ్లాం కూడ తల్లిగారింటికి పొయి రానే లేదు.

శానా ఏండ్లు గడ్సిపొయినై. ఇంతట్లనే రిటాయిరయ్యిండు. రెండు మూడిండ్లున్నా తన అపార్ట్‌మెంట్‌ల ఒక్కడే ఉండబట్టిండు. మొదటి పెండ్లం పిల్లలు పెండ్లిండ్లు చేసుకున్నరు. అప్పుడప్పుడు వచ్చి తండ్రిని సూసిపోయేటోళ్ళు. పెండ్లాం మాత్రం వచ్చేది కాదు. రెండో పెండ్లాం కూడ పిల్లల్ని తీస్కొని పొయ్యింది. ఒంటిగానే ఉండబట్టిండు.

ఒకరోజు తెల్లవారినంక పని మనిషి వొచ్చి తలుపు తీసి చూసింది. సోపాల గట్లనే కూసొని ఉన్నడు. సారూ! అని పిలిచింది. పల్కులేదు గిల్కులేదు. దగ్గర్కి పొయ్యి సూసింది. నిద్రపోతున్నడేమో అనుకున్నది. అంట్లు తోమిపెట్టి పోతున్న సారూ! అన్నది. అయినా కండ్లు తెరవలేదు. పల్కలేదు. కదిలిచ్చి సూసింది. సోపాల్నె ఎన్కకు పడిపోయిండు. ఎప్పుడు పానం పొయ్యిందో ఏమో! గామె పాత పని మనిషి. గామెకు పిల్లల నెంబర్లు తెలిసు, ఫోన్ చేసింది. గప్పుడు వాళ్ళొచ్చి చూసి ఏడ్చిన్రు. కర్మలు చేసిన్రు.

అందరు అన్కోబట్టిన్రు. "ఇద్దరు పెళ్ళాలను చేస్కున్నడు. నల్గురు పిల్లల్ని కన్నడు. అయినా జీవితంలో ఎన్నడు సుఖంగ బతకలేదు". గాయ్నకు 'పైసది లత్' తగిలింది. గింత పైస పిచ్చి ఎవ్వలకు ఉండకూడదు అన్కుంట పొయ్యిన్రు.



–లక్ష్మణరావు పతంగే
సెల్:92900 79047

# ఆత్మ నివేదన సుమాలు

డా॥ సమ్మన్న రచించిన "శరణాగతి" పుస్తకానికి మౌనశ్రీ మల్లిక్ రాసిన ముందు మాట..

ఈ సృష్టి ఒక అద్భుతం. ఎన్ని నక్షత్ర మండలాలు! ఎన్నెన్ని పాల పుంతలు!! ఈ అద్భుతాన్ని సృష్టించిన ఆ సర్వోన్నతమైన సృష్టికర్తతో సంభాషించడం పరమాద్భుతం. ఆ చైతన్యాన్ని స్తుతించడంలో వినిపించే నిర్వికల్ప సంగీతం అజరామరం. ఈ భూమి ఒక భౌతిక స్వరూపం. అందులో జీవం పురుడు పోసుకుంది. మరి భౌతికంలో ఈ అభౌతిక జీవన రాగాన్ని ఎవరు శృతి చేశారు? సైన్స్ అంటే కనుక్కోవడం కాదు. ఆల్రెడీ ఉన్నదాన్ని అవసరం కోసం వెతుక్కోవడం. గగనమంతా తిరుగుతున్న మనిషి, చూడాల్సిన ప్రపంచం వేరొకటి ఉంది. కానీ అది అందరికీ కనిపించదు. అందులోని నాదం అందరికీ వినిపించదు. ప్రతి ఒక్కరి దగ్గర మరో ప్రపంచం తలుపులు తెరిచే తాళం చెవి ఉంది. కానీ చాలా మంది, అది ఎక్కడో పెట్టి మర్చిపోయారు. మరో ప్రపంచం ఉందన్న స్పృహ వారిలో కలగడం లేదు. అసలు ఆ ఆలోచన ఎవరూ చేయడం లేదు.

అలాంటి ఆలోచన చేస్తున్నవారు కొందరు ఉన్నారు. వారే ఋషి పుంగవులు. పుట్టడానికి మరణించడానికి మధ్యన ఉన్న కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం తెలియకపోతే, జీవితానికి ఒక పరిపూర్ణత లభించదు. మనకు సార్థకత లభించాలంటే సృష్టికర్త అయిన సర్వేశ్వరుడిని స్మరించడం ఒక్కటే మార్గం.

ఆ మార్గమే మనిషి ఆధ్యాత్మిక వ్యక్తిత్వానికి ఎత్తైన దుర్గం.


ఆ ఆధ్యాత్మిక ఉన్నత పర్వత పంక్తులపై నుండి హిమనీనదమై ప్రవహించే ఆనందం మనలో కొందరే పొందుతున్నారు. వారిలో ఒకరు ఈ కవిత్వాన్ని సృజించిన సుకవి ఈటెల సమ్మన్న.

ఈ కవి ఉత్కృష్టమైన జీవన విలువలు కలిగిన వ్యక్తి అని ఈ కవిత్వం చదివినతర్వాత నాకు తెలిసింది. ఆయన మనతో పాటు ఉంటూ మనకు తెలియని అనంతమైన ఆత్మానందాన్ని పొందుతున్నారు. ఆయన ప్రపంచం ఎలా వుందో మనకు చూపించే ప్రయత్నమే ఈ కవిత్వం.

**ఆలాపన** కవితలో...

**"ప్రభూ!**
**నీ అనుగ్రహానికి**
**నేను పాత్రుడనో కానో**
**నీకే తెలుసు"** అంటారు.

ఇందులో మనం గమనిస్తే ఒక అద్భుతం గోచరిస్తుంది. మనల్ని సృష్టించిన ఆ భగవంతుడికి, మనకేం ఇవ్వాలో తెలుసు. మనం ఏదైనా కృపను పొందే అర్హత ఉందో లేదో కూడా ఆ లోకేశ్వరుడకి తెలుసు. కానీ మనం అజ్ఞానంతో భగవంతుడి ముందు మోకరిల్లి నాకు ఇది కావాలి, అది కావాలి అని అడగడం ఎంతటి హాస్యాస్పదమో కదా!? అందుకే రచయిత ఇక్కడ భగవంతుడి అనుగ్రహానికి తాను పాత్రుడనో కాదో అని ఆయనకే వదిలేస్తున్నారు. అంటే ఈశ్వరుడిని




ప్రతులకు:
డా॥ఈటెల సమ్మన్న
207, సిరి రెసిడెన్సీ స్ట్రీట్ నెం.2
తార్నాక, హైదరాబాద్-17
సెల్: 98852 38654

ఏవి అడగాల్సిన అవసరం లేదు. తనకు ఏమి ఇవ్వాలో, ఏం ఇవ్వకూడదు కూడా తెలుసు. అలాంటప్పుడు అడగడం దేనికి అనేది రచయిత ప్రశ్న.

**అక్షర సుమాలు** కవితలో..

**"నీ ధ్యాన యజ్ఞంలో**
**ఆహూతులై**
**పునీతమై**
**ఆకృతి మారి**
**ఆధ్యాత్మిక తలంపులో**
**అక్షర సుమాలై విరబూస్తున్నాయి**
**ప్రభూ!**
**ఆ సుమాలనే**
**నీ పూజకు పుష్పాలుగా**
**సమర్పించగా**
**అనుగ్రహించు తండ్రీ!"** అంటారు.

ధ్యానం అంటే ఉచ్ఛ్వాస నిశ్వాసలే కాదు భగవంతుడికి మరింత దగ్గర అవడం. ఆ ధ్యానంలో పలవరిస్తున్నటువంటి అక్షర సుమాలు స్వామికి అర్పిస్తున్నారు కవి. భగవంతుడి స్మరణంలో ఉద్భవించే పవిత్రమైన భావాలను సమర్పించడం ఎంతటి సౌందర్యవంతమైన ఆలోచన.

**యక్ష ప్రశ్న** కవితలో....

**"దీన జనసేన సేవలోనే**
**మానవాభ్యుదయ పథంలోనే**
**అద్వైత సిద్ధిని పొందాలనే**
**ఆశయాన్ని సాధించడమెలా?"**

అని భగవంతుడిని అడుగుతున్నారు.

కానీ దీనజనుల సేవ పరమాత్ముని సేవే నన్న విషయం కవికి తెలియనిదా? ఆ దారిలో పయనిస్తున్న కవికి దాని ప్రయోజనం తెలియదా? తెలుసు, అన్నీ తెలుసు. కానీ భగవంతుడిని మరోసారి అడిగి, సాంత్వనం పొందుతున్నారు.

భ్రమర భ్రమ కవితలో...

**"అంతమున**
**మృత్యువాత పడవలసినదే**
**సత్యం**
**గ్రహింపు లేక**
**మితిమీరిన వ్యామోహంతో**
**తుల లేని సిరిసంపదల కోసం**
**అతి విలాసవంతమైన**
**జీవనం కోసం**
**తాను శాశ్వతమనే భ్రమలో**
**విషయ వాంఛలతో**
**భోగలాలసుడై**
**జీవించే మానవుని ఏమనాలి?"** అని

భగవంతున్ని అడుగుతున్నారు. తప్పుడు దారులలో నడిచే వారిని, ఏమీ అనవలసిన అవసరం లేదు. కర్మ తప్పకుండా వెంటాడుతుంది. ఆ ఫలితాన్ని అనుభవించక తప్పదు. అది మంచైనా చెడైనా. విలాసం కోసం ఇంతటి దారుణాలకైనా ఒడిగడుతున్నారు. అది ఆ పరమాత్మునికి తెలుసు.

ఓ మాయాకారకా కవితలో..

**"అంతరంగంలో అంతర్వాహినిలా**
**పరవళ్ళు త్రొక్కుతూ**
**విశ్వమంతా నాలోనే నిక్షిప్తమైనటుల**
**స్థూల సూక్ష్మస్థాయిలలోకి**
**గోచరాగోచర స్థితులలోకి**
**పరిణతి చెందుతున్నట్టుల**
**చిత్రమౌ భావనలు ప్రస్ఫుటమౌతున్నై**
**ప్రభూ!**
**ఇది నా చిత్తభ్రమయా?**
**లేక నీ అనంత మాయయా?"** అంటారు.

భగవంతుని ధ్యానంలో ఉన్నప్పుడు అనేక అద్భుతాలు జరుగుతూ ఉంటాయి. ఆ అనుభూతులు సరి కొత్తగా ఉంటాయి. ఆ జలదరింపులు నిత్యం జరుగుతూ ఉంటాయి. అది అనుభూతిస్తున్న వారికే తెలుస్తుంది. ధ్యానం నుంచి బయటికి వచ్చిన తర్వాత అనుభూతిని నెమరు వేసుకుంటున్నప్పుడు అది భ్రమలాగే ఉంటుంది. కానీ అది నిజం. దేవుడి దర్శనానికి వెళ్ళినప్పుడు ఆ ప్రసన్నతకు కారణం ఏమిటి? బయటికి వచ్చినప్పుడు ఆ ప్రశాంతత లేకపోవడానికి కారణం ఏమిటి? ఎంత వయసు వచ్చినా అమ్మ ఒడిలో సేద తీరుతున్నప్పుడు కలిగే ఆ పరమాద్భుతమైన అనుభూతికి కారణం ఏమిటి? అది రక్త సంబంధం. ఇది కూడా అలాంటిదే దైవీక సంబంధం. అన్ని సంబంధాలకంటే ఈ దైవీక సంబంధం చాలా గొప్పది. అది మాయా కాదు మర్మం కాదు.

తాపత్రయము కవితలో..

**"చుట్టూ విష సర్పాలు బుస కొడుతున్నా**
**ముళ్ళ పొదల మధ్య వికసించి**
**అలరించే మొగలి పువ్వులా మననీ"**

అంటారు.

భగవంతుని స్మరించేందుకు ఎటువంటి ఆంక్షలు లేవు. ఏ ఆటంకాలు లేవు. సర్వకాల సర్వావస్థల యందు స్మరించవచ్చు. నిద్రలోనూ మెలకువలోనూ పరధ్యానంగా మారిపోవచ్చు. అదే ఆనందం. అదే పరమానందం. చుట్టూ విష సర్పాలు ఉంటాయి. అలాంటప్పుడే మనం నిబద్ధతగా ఉండాలి. జాగరూకులమై సంచరించాలి. ఉద్యానవనంలో సంచరించేటప్పుడు కూడా పాదాల వైపు దృష్టి సారించాలనే సృష్టి రహస్యాన్ని మర్చిపోకుండా ఉండడానికే విష పురుగుల సృష్టి జరిగింది. ఈ సృష్టి అన్ని ప్రాణులది. ప్రతి ప్రాణికి ఈ లోకంలో విలువ ఉంది. వాటి వాటి జీవన ధర్మాలను నిర్వర్తిస్తుంటాయి. కానీ మనుషులు మాత్రమే అలా ఉండలేక పోతు న్నారు. తప్పటడుగులు వేయడం వల్ల జరిగే పరిణామాలను అంచనా వేయలేకపోతున్నారు.

ఈ కవి మంచు బిందువులతో మాట్లాడగలుగుతారు. పువ్వులు చెప్పే ఊసులను వినగలుగుతారు. అంతర్లోకాలలో విహరించగలుగుతారు.

అందుకే అద్భుతమైనటువంటి తన భావాలను మనతో పంచుకున్నారు. ఈ కవిత్వం చదివి నేను చాలా నేర్చుకున్నాను. కొత్త అనుభూతులను రుచి చూశాను.

నన్ను ఈ సమస్త ప్రకృతికి మరింత దగ్గర చేసిన కవిత్వం ఇది.

తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకొని ఉత్తమ శ్రేణి కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్న ఈ పరమాద్భుత కవికి కైమోడ్పులు.

పరమేశ్వరా..
ఈ కవిత్వాన్ని దశదిశలా
ప్రవహింపజేయుము తండ్రీ..



–మౌనశ్రీ మల్లిక్
8919338546

# ఆర్ష కవి చెన్నప్ప శతకం

పుస్తక సమీక్ష

గురువును మరచిపోయే శిష్యులు, శిష్యులను పట్టించుకోని గురువులు వుండే ఈ రోజులలో, పరిశోధన పర్యవేక్షకుడైన ఆచార్యున్ని గురువుగా గౌరవిస్తూ, గురు భక్తితో వారికి మకుట స్థానం అలంకరింపచేస్తూ శతకాన్ని సమర్పించడం అరుదైన ఆదర్శంగా భావించవలసివుంది.

ఆర్షకవి ప్రొ॥ మసన చెన్నప్ప, తనను ఎంతో ప్రభావితం చేసిన ఆచార్య రంగానాథాచార్యులు మీద భక్తితో 'రమ్య గుణ సనాథ రంగనాథ' మకుటంతో శతకం సమర్పిస్తే, అదే పరంపరానుగత అభినివేశంతో డాక్టర్ గొట్టుముక్కుల నరసింహ శర్మ 'మసన చెన్నప్ప మాయప్ప మహితుడప్ప కనగ కరమొప్ప కవి కుప్ప కనకమప్ప' మకుటంతో **'ఆర్షకవి చెన్నప్ప శతకం'** వెలువరించటం ఎంతైనా అభినందనీయం.

తెలంగాణ సాహితీ సీమలో శతక పద్య ప్రక్రియకు డా॥ నరసింహశర్మ వంటి కవులు జీవం అందిస్తున్నారు.

చెన్నప్ప గురు సాన్నిహిత్యంలో పరిశోధనే కాక పద్య కవితలు వ్రాయటం తనకు పరిపాటి అయి నట్టు కవి 'నా మాట'లో చెప్పారు.


దేశభక్తి, దైవభక్తి, మాతృభక్తి సాహితీ వ్యక్తిత్వంగా కలిగిన ప్రొ. చెన్నప్ప గారి బాల్యం, విద్యాభ్యాసం, రచనా వ్యాసంగాన్ని సీసపద్య చందస్సులో నరసింహాశర్మ దర్శింపచేసారు.

ఆర్షధర్మ చరితుడు, సనాతనధర్మ పరిరక్షణకు అంకితమైన డా॥ చెన్నప్ప భాషాభిమానంతో పాటు సామాజిక స్పృహను, కవిత్వ లక్ష్యాన్ని ఈ శతకం వివరిస్తోంది.

గణేశ స్తుతితో ఆరంభమై గంగోత్రి వైభవ రచనా ప్రస్తావనతో ముగిసిన 108 పద్యాలలో సందర్భోచితంగా ఎన్నో జీవన విశేషాలున్నాయి.

సతీమణి ప్రమీలమ్మ నిష్కల్మష వ్యక్తిత్వ విలువలు, గురువులు, తల్లిదండ్రులు, కుటుంబ విశేషాలు అమెరికా పర్యటన ఆసక్తికరంగా అలరిస్తున్నాయి.

**"కాలమన్నది కలకరిగిపోవక పోదు**
**అలల పోలిక నెపుడు జలధియందు"**
**అంటూ**
**కాలమన్నది కొలనుగా కలువపూలు**
**విలువ నెరిగి యుద్దానితో**
**వెలగవలయు"** వర్షపు చుక్కలు ముత్యాలుగా పరిణమించిన రీతి లో ప్రొ॥ చెన్నప్ప నేటికీ కలంతో గళంతో సాగిస్తున్న జీవనం ఆర్షకవి అమృత బిందువులుగా ఈ శతకంలో శతకకర్త డాక్టర్ గొట్టుముక్కుల నరసింహాశర్మ ప్రశంసనీయంగా వివరించారు.




ప్రతులకు:డా॥ముక్కుల నరసింహాశర్మ,
ఇ.నెం.14-8- 196, మర్లు,
మహబూబ్‌నగర్- 509 001
సెల్: 9848584953



–జయసూర్య
9440664610

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది. అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

### వైతాళికుడు వేమన

నేటి నానీ కవితలకు ఆద్యుడు
నవ యుగ వైతాళికుడు
అభ్యుదయ భావాలకు మూలపురుషుడు
ఆంధ్రుల అభిమాన కవివర్యుడు
ఆటవెలది పద్యాలతో
ఆలరించిన కవి శ్రేష్టుడు
అర్థమయ్యేలా పామరులకు చిన్నపదాలతో
చిరస్థాయిలో నిలిచే పద్యాలను భోధించిన
సమాజరుగ్మతలను ఎండగట్టిన
సంఘసంస్కర్తయే మన వేమన
విశ్వధాభిరామ వినుర వేమనంటూ
వినువీధిలో వ్యాపింపచేసేను
తెలుగు జాతి ఖ్యాతి
వేమన శతకాలు జనుల నోటిలో నాని
జనపదుల గుండెల్లో నిలిచి
పాఠ్యపుస్తకాలలో పాఠాలుగా
భావి తరాలకు మార్గదర్శన మయ్యేను

–సయ్యద్ అబ్దుల్ నజీర్, 8897811024

### మంచి మాట మర్యాద

ప్రతి మనిషి జనన మరణ పోరాటంతో
జీవితం సాగిస్తాడు
పుట్టినప్పుడు ఏమి తేలేదుగిట్టినప్పుడు ఏమి తీసుకుపోడు
నట్ట నడుమ బ్రతుకు నాటకం అని తెలిసిన
ఆశాపూరితమైన కోరికలతో ఆనంద జీవితం గడపాలనుకుంటాడు
తన స్వార్థం కోసం మానవత్వం మరచిపోయి గొప్పగా
జీవించాలనుకుంటారు కొందరు కానీ ఎన్ని పుణ్యక్షేత్రాలు తిరిగిన ఎన్ని పూజలు చేసిన
వారి జన్మ కర్మలు తొలి పోవడానికి వారి పూజలన్నీ
మానవత్వం లేని మనిషికి చివరికి ఏమి మిగలదు
నవత్వంతో మంచి మనసుతో తోటి వారికి
ఆప్యాయత ప్రేమ అనురాగంతో సహాయ సహకారాలు అందిస్తూ
పలువురి కష్టం బాధల్లో పాలుపంచుకుంటూ
మానవసేవే మాధవ సేవ అని అందరూ ఉండాలి
అందరిలో నేనుండాలి అని పలుకూరి కొరకు ఆలోచించి ఆదుకునే దేవుడని అంటారు
తన స్వార్థం చూసుకోకుండా మంచి మనసు మర్యాద మాట స్వయంకృషితో జీవితం
అందర్నీ గౌరవిస్తూ అందరితో కలిసి ఉంటూ నేనున్నానంటూ ప్రతి మనిషి బాధ
పంచుకుంటూ జీవిత గమనం గడిపే ప్రతి మనిషికి సమాజంలో
కీర్తి ప్రతిష్టలు గౌరవం చివరికి మిగులుతాయి
మంచి మాట సంస్కారంతో మర్యాదతో జీవితం సాగించే
ప్రతి మనిషికి సంఘంలో గౌరవం చివరికి మిగులుతుంది

–మిర్యాల లక్ష్మి
6301032158

### గిడుగు తెలుగు గొడుగు

పాండిత్యపు భాష కన్నా
పామరుడి పదాలను చెంత చేర్చి
అక్షరాల వడిలో
గిడుగు దిద్దించిన
సులభమైన తేనియల విందు మన తెలుగు.,.
తెలుగు వ్యవహారిక భాషా పితామహుడుగా
గ్రాంథిక భాషను గద్దె దింపిన ఘనుడై
వ్యవహారిక భాషకు వన్నెలద్దిన గిడుగు...
సరళమైన భాష సామాన్యుడి కందించి
గద్య చింతామణితో ఘన కీర్తి పొంది
పదవులను పరిత్యదించి
పదిమందిని ముందుకు నడిపించి
పాండిత్యపు భాషను పల్లకి దింపి.
తెలుగును తెలుగు ప్రజలకు చేరువ చేసి
వాడుక భాషలోని పదాలకు
వేదిక కట్టివేడుకచేసిన
మహనీయుడు మన గిడుగు
తెలుగు భాషకు గొడుగు

–వనం మంజు భార్గవి
9390685281

### వైతాళికుడు వేమన

నవ యుగ వైతాళికుడు
అభ్యుదయ భావాలకు మూలపురుషుడు
ఆంధ్రుల అభిమాన కవివర్యుడు
ఆటవెలది పద్యాలతో
ఆలరించిన కవి శ్రేష్టుడు
అర్థమయ్యేలా పామరులకు చిన్నపదాలతో
చిరస్థాయిలో నిలిచే పద్యాలను భోధించిన
సమాజరుగ్మతలను ఎండగట్టిన
సంఘసంస్కర్తయే మన వేమన
విశ్వధాభిరామ వినుర వేమనంటూ
వినువీధిలో వ్యాపింపచేసేను
తెలుగు జాతి ఖ్యాతి
వేమన శతకాలు జనుల నోటిలో నాని
జనపదుల గుండెల్లో నిలిచి
పాఠ్యపుస్తకాలలో పాఠాలుగా
భావి తరాలకు మార్గదర్శన మయ్యేను
ఇది నా స్వీయరచన

–సయ్యద్ అబ్దుల్ నజీర్
8897811024

### సంస్కృతి

సంస్కృతి తోటి సందేశం
విభిన్న సంస్కృతుల సమహారం విశ్వం
ఎందుదెందు చూసిన అందు మన కొక కొత్త జాతీయత
సంస్కృతుల నుంచి సంప్రదాయం
సంప్రదాయం తో ప్రాంతాలు
భిన్నంత్వంలో ఏకత్వం మన జన్మ భూమి భారతీ
భాష కొక సంప్రదాయం
మతాల కొక సంప్రదాయం
అనేక భాషల, మతాల సమహారం ఈ త్యాగ భూమి
సంస్కృతి కి ప్రతి రూపం జాతరలు
గంగమ్మ పోలేరమ్మ ఎల్లమ్మ
మావూలమ్మ, గండి పోచమ్మ
ఈ అమ్మల గన్న అమ్మ భద్రఖాళమ్మ
వీరి జాతర్లకు చేతి నిండా సొమ్ములుంటే రోజు జాతలే
సంస్కృతి సంప్రదాయం ఉత్సవాల తోటి కళలు
ప్రాంతాల ఉనికికి, సమాజ శ్రేయస్సు కు కళలే

–ఏ. రామమూర్తి
9246391142


### చర్వితి చరణం

ఉచితాల పేరుతో పంపకాలు...
సామాన్యుల కదియే పదివేలు...
స్వాహా చేసేది కొంత..ప్రజలకు ఇచ్చేది గోరంత
గెలిచిన వెంటనే నాయకులకు సీటు పదిలం
అందుకు చేయాలి ఎన్నో పోరాటాలు
మళ్ళీ ఎలక్షన్లలో గెలవాలని
దోచుకుంటారు అందినంత
కంచె చేను మేసినట్లుగా
ఇది నిరంతరం జరిగే యుద్ధం
అందరికీ తెలిసిన పద్ధతే అయినా
పడిపోతాము ఓట్లు అమ్ముకోవటంలో
కన్నతల్లి ఉన్న ఊరు ఊసులే లేవు
ఎక్కడో చదవాలి ఎంత ఖర్చైనా
అక్కడ ఉద్యోగం లేకపోయినా
రాలేరు స్వదేశానికి..దూరపు కొండలు నునుపు
తెలుసుకునేసరికి అంతా శూన్యం...
అప్పుల మయమే కొందరికి...
తిరిగిరాని లోకాలే వారికి గతి...

–షామీర్ జానకీదేవి
93944611037

# భండారు విజయ మంచి స్త్రీవాద రచయిత్రి

–సభలో వక్తల ప్రశంస





భండారు విజయ సంపాదకత్వం వహించిన ‘పరిష్కృత’ కథా సంకలనం మరియు వారి స్వీయ కథా సంపుటి ‘సహజాత’ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు.



భండారు విజయను సన్మానిస్తున్న డా॥నామోజు బాలాచారి, పి. జ్యోతి. బి.యస్.రాములు, జూపాక సుభద్ర, నెల్లుట్ల రమాదేవి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4 (నేటినిజం ప్రతినిధి): హైదరాబాద్ విమెన్ రైటర్స్ మరియు హస్మిత ప్రచురణ సంస్థలు కలిసి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో, రవీంద్రభారతి, కాన్ఫరెన్స్ హాలులో జనవరి 23న నిర్వహించిన భండారు విజయ సంపాదకత్వం వహించిన ‘పరిష్కృత‘ (కథా సంకలనం) మరియు వారి స్వీయ కథా సంపుటి ‘సహజాత’ పరిచయ సభను ప్రారంభిస్తు వరంగల్ అరసం అధ్యక్షులు శ్రీ నిధి వేదిక మీదకు అతిథులను ఆహ్వానించి భండారు విజయ గురించి, ఆమె స్త్రీ వాద రచనల గురించి, రాబోయే రచనల గురించి పరిచయం చేసారు.

సభాధ్యక్షులు తెలంగాణ బిసి కమిషన్, తొలి కమీషనర్, శతాధిక రచయిత బి.ఎస్. రాములు మాట్లాడుతూ... తాను కథలు రాస్తూ, ఇతర రచయితలతో వర్క్ షాప్ లు నిర్వహించి , వారిచే ‘పరిష్కృత ‘ లాంటి కథా సంకలనాలను తీసుకుని వస్తున్న భండారు విజయ మంచి స్త్రీవాద రచయిత అని కొనియాడారు.

కథకులు కథలు రాసేటప్పుడు పాటించాల్సిన కొన్ని నియమాలు ఉంటాయని, వాటిని తను “కథల బడి” పుస్తక రూపంలో మూడు దశబ్దాల క్రితమే రాసి ప్రచురించానని, ఆ పుస్తకం ప్రతి రచయిత చదివినట్లయితే కథలు రాయడంలో మెలుకువలు పాటించే అవకాశం ఉంటుందని అన్నారు.

ముఖ్య అతిధి తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నర్సింహారెడ్డి మాట్లాడుతూ... స్త్రీవాదం భూమికగా చేసుకుని భండారు విజయ రచనలు చేస్తు, ఇతరులతో రాయిస్తున్న మంచి రచయిత. తాను గతంలో అనిశెట్టి రజితతో కల్సి తెలంగాణ ప్రాంత విశిష్టతను తెలియచేసే “జిగర్” అనే అరుదైన కవిత్వ సంకలనం తీసుకుని వచ్చారు. ఎంతో శ్రమకోర్చి, తెలంగాణ కు అద్భుతమైన చేర్పును తెచ్చిన ఆ పుస్తకంలో నా కవిత్వం కూడా వుంది అన్నారు. తన మిత్రురాలు కీ॥ శే॥ అనిశెట్టి రజితకు అంకితం ఇస్తూ తన కథా సంపుటి ‘సహజాత’ ను తేవడం ఆమెను స్మరించుకోవడం గొప్ప విషయం అన్నారు. తను రచనలు చేస్తు, ఇతర రచయితల కథలతో కథా సంకలనాలు తీసుకుని వస్తూ స్త్రీవాదాన్ని సమర్ధవంతంగా ముందుకు తీసుకుని వెళ్తున్నారని అన్నారు.

‘సహజాత ‘ కథా సంపుటిని పరిచయం చేస్తూ, ప్రముఖ సాహిత్య విమర్శకురాలు, రచయిత పి.జ్యోతి మాట్లాడుతూ..ఈ సంపుటిలో వున్న 21 కథలు వస్తు పరంగా భిన్నమైనవని చెబుతూ ప్రతి కథ ఒక కొత్త చూపును అందిస్తుందని అన్నారు.

కథలు విక్టిమైజడ్ మోడ్ లో వున్నాయని, సమస్య పరిష్కారాలు ఐడియాలిస్టిక్ గా, సైకోతెరిపి, కౌన్సిలింగ్ పద్దతిలో వున్నాయని అన్నారు. కథల్లో మనకు యాదార్ధవాదం, ఆదర్శవాదం కలిపి రాయడం జరిగిందని అన్నారు.

కథల్లో వర్ణనలు, పోయేటిక్ ఎక్స్ప్రెషన్ మూడ్ లోకి తీసుకెళ్తాయని, కథల్లో వస్తు పరంగా శిల్ప పరంగా అద్భుతంగా వున్నాయని అన్నారు. ఎలట పద్దతిలో సంతానం కనడం, సింగల్ మహిళలు మై ఛాయాస్ అంటూ పిల్లల్ని కనడం విప్లవాత్మకమైన ఆలోచనలు రేకెత్తిస్తాయని అన్నారు. అలాగే కులాంతర వివాహాలు, అందులోని సమస్యలు అద్భుతంగా ప్రెజెంట్ చేసారు. ఔఖీఎ పెండ్లిళ్ల విఫలత్వాలను తెలియజేసారు. అన్నీ కథలు బాగున్నప్పటికి, నాకు బాగా నచ్చిన కథలు అమ్మగది, దేవుడమ్మలు.

పిల్లల లైంగిక వేధింపులు, సామూహిక అత్యాచారాల కథలు కూడా ఇందులో వున్నాయని ముఖ్యంగా యువత తప్పకుండా ఈ కథలు చదవాలని కోరారు.

ఇదే పుస్తకం మీద ప్రముఖ దళిత రచయిత జూపాక సుభద్ర మాట్లాడుతూ... ఇందులోని అన్ని కథలు “సర్వే జన సుఖినో భవంతు” లా ముగుస్తాయని, కుటుంబాలు, వాటి పరిసరాలు , తెలంగాణ ఉద్యమంలోని సంఘటనలు, ట్రాన్స్ కమ్యూనిటీకి సంబంధించిన కథలను చాలాబాగా రాసిందని అన్నారు. స్త్రీవాదంతో కథలు రాస్తూ, అదే వాదాన్ని తాను ఆచరిస్తున్నట్లు నటించే పురుష రచయితలు, తమ ఇళ్లల్లో స్త్రీలను ఎలా అణచివేస్తారో చెప్పే కథ చాలా బాగుంది. ఇందులో వున్న 21 కథలు మనల్ని చదివిస్తాయని, ముఖ్యంగా యువత ఈ కథలు తప్పకుండా చదవాలని కోరుతూ , ఈ కథల్లో సీతామహాలక్ష్మి, దేవుడమ్మ తనకు బాగా నచ్చాయని చెప్పారు.

రెండవ పుస్తకం “పరిష్కృత” ను పరిచయం చేస్తూ ప్రముఖ రచయిత, కార్టునిష్టు నెల్లుట్ల రమాదేవి “కాలాలు మారుతున్న స్త్రీల సమస్యలు” అలాగే వున్నాయని, ఇందులో కనిపించే సమస్యలు కొన్నయితే కనబడనివి అనేకం అని అన్నారు.

గృహహింస అంశం మీద ఇందులో 16 కథలున్నాయని, అందులో దేనికవి భిన్నమైన సమస్యను తెలియచేస్తాయని చెప్పారు.

భండారు విజయ తెచ్చిన ఈ పరిష్కృత సాహిత్యం చదివే వారికి సమస్యల పట్ల ఒక అవగాహనను ఇస్తాయని అన్నారు.

ఏ వస్తువు తనంతట తాను కథగా మారదని, వస్తు ప్రధానంగా తెచ్చిన ఈ కథల్లో ఒక్కొక్కరిది ఎడతెగని వేదన అని అన్నారు. కథలన్నీ చదివిస్తాయని అందరూ చదవాలని కోరారు.

ఇదే పుస్తకం మీద మరో రచయిత కస్తూరి ప్రభాకర్ మాట్లాడుతూ..మనం ఎప్పుడు ప్రొటెక్షన్ జీనిట రిస్ట్రిక్షన్ గురించి మాట్లాడుతామని, విక్టిమ్ ధోరణిలో కాకుండా విక్టి మైజడ్ ధోరణిలో సమస్యలు చూడాలని కోరారు.

గృహహింస, లింగ వివక్ష, ఇంటిచాకిరీ, అనుమానం, వరకట్నం,సంతాన సమస్యలు, వివాహ వ్యవస్థలో వున్న విభిన్న ధోరణులను ఈ కథల్లో చూస్తామని అన్నారు.

ఈ కథలు చదువుతున్నప్పుడు మన గుండెల్ని పిండేస్తాయని అంటూ...విపరీతమైన హింసా రూపాలు , చిత్రహింసలు ఈ కథల్లో కనబడతాయి. చదువుకున్న స్త్రీలు కూడా తప్పని పరిస్థితుల్లో అనుభవిస్తున్న హింస “రక్త గాయాల నది”గా ప్రవహిస్తూ..మనల్ని ఆలోచింప చేస్తాయి. ఇలాంటి కథలు కాలేజీ విద్యార్ధులకు పరిచయం చేయవల్సిన అవసరం, వారిని చైతన్య పరచవల్సిన అవసరం ఎంతైనా వుందని అన్నారు.

తెలంగాణ సాహిత్య అకాడమి కార్యదర్శి శ్రీ నామోజు బాలాచారి మాట్లాడుతూ... కాలం మారుతున్న కొద్ది మహిళల సమస్యలు కొత్త రూపాలను సంతరించుకుంటున్నాయి. సమాజంలో పురుషుల కన్నా స్త్రీలే ఎక్కువగా స్థిరంగా, బలంగా వుంటారు.


కష్టాలను తట్టుకుని, సానుకూల దృక్పధంతో కథలు ముగినీచిన కథలే బాగుంటాయి. పేద, మధ్యతరగతి , ధనిక కుటుంబాల్లో కూడా ఒక్కో రకమైన సమస్య కనిపిస్తుంది. సమస్యలు లేని స్త్రీ లెవరు ఈ సమాజంలో వుండరు. సాహిత్యం ఎప్పుడు పరిష్కార దిశగా వున్నప్పుడే అది సమాజానికి, వ్యక్తులకు ఉపయోగపడుతుంది. అలాంటి కథలు, తను రాయడమే కాకుండా ఇతర రచయితలతో స్త్రీవాద దృక్పధంతో కథలు రాయిస్తూ, ఆ పుస్తకాలు ముద్రించి సమాజం దృష్టిలో పెడుతున్న భండారు విజయ గారికి అభినం దనలు తెలియచేసారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ తరపున రచయిత భండారు విజయను శాలువతో సత్కరించారు.

చివర గిరిజ పైడిమర్రి వందన సమర్పణ చేశారు.

# రెండు మంచి నీటి మహా సముద్రాల్లాంటి కథా సంపుటులు

పుస్తక సమీక్ష







**ప్రతులకు:** సి.రాధిక, ఇ.నెం.4-1042/4, గాయత్రీనగర్, గ్రీమ్‌పేట్, చిత్తూరు-517 002 సెల్: 94923 78422

సస్పెన్స్, క్రైమ్, హాస్యం కారుణ్యం, ఆర్తి, శృంగారం. ప్రతి కథలోనూ ఓ వెరైటీ. కథల్లో కనిపించేది మనచుట్టూ ఉండే నేటి ప్రపంచం. కథల్ని చదివాక ఏదో వొక ఆనందం మనసు అంచుల్ని తాకుతుంది. నవల రాసినా, కథల్ని అందించినా నేటి యువత, వారి జీవితాల ఆవిష్కరణ, సి.ఎన్.చంద్రశేఖర్‌గారి రచనల ప్రత్యేకత.

ఇంతవరకు 10 కథా సంపుటులు 2 నవలలు 1 కవితా సంపుటిని అందించిన సి.ఎన్. చంద్రశేఖర్ (చిత్తూరు నారాయణరావు చంద్రశేఖర్) మాతృభాష మరాఠీ. అయితేనేం ఆయన మంచి కథలనందించే ఘనాపాఠి. యువ హృదయాలను సున్నితంగా మీటి వారికి అవ్యక్తా నందం కలిగించగల మేటి. చిన్న కథలు 1 పేజీ నుంచి 10 పేజీలు. రాసినా ప్రతీ కథలో సమగ్రత సంపూర్ణత. చెప్పాలనుకున్న విషయాన్ని పూర్తిగా విషదీకరించగల సామర్థ్యం ఉన్న రచయిత.

ప్రస్తుత కథా సంపుటి **“అందమైన జీవితం”**లో 17 కథలున్నాయి.

మనిషికి మనిషి సాయం అవసరం. కొందరు స్వభావరిత్యా ఇతరులకు సాయపడుతారు. ఆ సాయం ఎలాంటిదంటే– ఎన్నటికీ మరిచిపోలేనిది. **‘మా వారి మంచితనం’** కథలో సుకుమార్ అలాంటివాడే. ఎవరికి ఏ అవసరం వచ్చినా అరమరికల్లేకుండా సాయం చేసే రకం. ఒక్కో సందర్భంలో ఆత్మీయులు కూడా చేయలేనంత సాయం చేసేతత్త్వం. సుకుమార్ సిద్దాంతం ప్రకారం ఏదో ఆశించి చేసినదాన్ని సాయం అనరు. వ్యాపారం అంటారు (పే.13) ఓసారి భార్య గీత బర్త్‌డే పార్టీ అని హెూటల్‌కు వెళతారు సుకుమార్ గీతలు. పార్టీ మధ్యలో స్నేహితుడి ఆక్సిడెంట్ విని గీతకు చెప్పకుండా హుటాహుటిన వెళ్ళి 3 రోజులకు కాని తిరిగిరాడు. కారణం ఫ్రాక్చరైన స్నేహితుడికి లోకల్‌గా ఎవరూ లేరు. తలిదండ్రులు వచ్చేదాకా సుకుమార్ స్నేహితుడికి తోడుగా హాస్పిటల్‌లో ఉంటాడు. మరో సందర్భంలో ఇంటి పెద్ద మరణించాడు. డెత్ సర్టిఫికేట్లు వగైరా సుకుమారే సాయం చేసి తన డబ్బులు పెట్టుకుంటాడు. చని పోయిన వ్యక్తి కొడుకు డబ్బులు తిరిగి ఇవ్వటంలో ఆలస్యం అయినా తప్పు పట్టడు. మరో సందర్భంలో సుకుమార్ వల్ల ఎంతో సాయం పొందిన వ్యక్తికి సుకుమార్ ఊరికే ట్రాన్స్‌ఫర్ అవుతుంది. నెల రోజులైంది ఆవిడ ఊరికి వచ్చి. అయినా సుకుమార్‌ని కలవటానికి రాదు. ఇంత కృత జ్ఞతయా అని దంపతులు మల్లాగుల్లాలు పడుతోంటే ఆవిడకు జ్వరం అని తెలుస్తుంది. మరో మాట లేకుండా, మరో ఆలోచన లేకుండా సుకుమార్ ఆమెను పరామర్శించేందుకు ఉద్యుక్తుడవుతాడు. ఇలా ఎందుకు జరుగుతోన్నదో రచయిత చేసే అనాలిసిస్– గతంలో. మనుషుల ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండేది. అందువల్ల మరో మనిషి సాయం అవసరం అయ్యేది. ఇప్పుడు చాలా మంది దగ్గర డబ్బు ఉంది అది ఇచ్చే భరోసా ఉంది. దేన్నైనా డబ్బుతో కొనగలమనే ధీమా ఉంది (పే.17) అన్న కంక్లూజన్. ఇది అందరి పట్లా అన్వయించకున్నా, నేటి కాలపు మనుషుల్లో ఉంది. సుకుమార్ లాంటి వాళ్ళ సాయం చేసే తత్త్వం/ గుణం ఉన్న మనుషులు ఏ కొద్దిమందో ఉంటారు. వారి తత్త్వమే అంత అని “మా వారి మంచితనం”లో మంచిని పెంచాలన్న సదుద్దేశంతో రచయిత మనకు చెబుతారు.

మరో కథ **‘నీ జతగా నడవాలని’** బ్యాంకు ఎంప్లాయి ప్రదీప్. లాస్య అనే కష్టమర్ కూతురు బ్యాంకుకు వస్తుంది. తల్లి ఎకౌంట్‌లోంచి డబ్బు డ్రా చేయాలి. తల్లికి అనారోగ్యం. మంచం మీంచి లేవలేదు. కథ విన్న ప్రదీప్ లాస్య వెంట వెళ్ళి, తల్లి ఆరోగ్య స్థితి నిజమేనని నిర్ధారించుకుని, క్యాషు ఇస్తాడు. రచయిత బ్యాంకు ఉద్యోగి కావటం వల్ల ఎన్నో బ్యాంకు నిబంధనలు vs మానవ త్వం చర్చకు పెట్టి, నిబంధనలు ఎలా ఉన్నా, మానవత్వం విస్మరించరాదనటం కథలో గొప్పనీతి. ఆ నీతిని ఆచరించటం వల్ల ప్రదీప్‌కు ఎంతో మంచి జరుగుతుంది. ఆ మంచి ఏమిటో పాఠకులు కథ చదివి తెలుసుకోవాలి.

దెయ్యాలు ఉంటాయా? క్రైం & సస్పెన్స్ కథ **‘ఓ వర్షం కురిసిన రాత్రి’**. కథనంలో మంచి సస్పెన్స్ కలిగించారు రచయిత. సంకలనంలో చివరి 6 కథలు సింగిల్ పేజీ కథలు. పాఠకుడికి పెద్ద కథలంత మనోల్లాసం కలిగించేంత వివరంగా వ్రాసి తన ప్రతిభను ప్రకటించుకున్నారు. ఒక్కో కథకు చివర పాఠకుల అభిప్రాయాలు ఇవ్వటం క్రొత్త మంచి ఆలోచన.

ఇదే రచయిత రెండవ కథా సంకలనం **‘ఆదివారం కథలు’**. ఈనాడు దినపత్రిక ఆదివారం అనుబంధంలో 2007 నుండి 2015 వరకు ప్రచురితమైన కథల్లోంచి 11 కథల్ని ఏరి ప్రచురించి అందిస్తున్నారు.


దేశసేవ చేయాలంటే దేశ సరిహద్దులో చలికి వణుకుతూ గస్తీ కాయనక్కరలేదు. మీ పిల్లల్ని మంచి పౌరులుగా చేసిన సమాజంలోకి పంపండి. మీతో పాటు మీ చుట్టు ప్రక్కల ఉన్న వాళ్ళు కూడా క్షేమంగా, సురక్షితంగా ఉంటారు. ఇంతకంటే గొప్ప దేశ సేవ మరోటి ఉండదు అంటారు.

మంచి వ్యక్తి పదిమందిలో ఒక్కడున్నా ఈ ప్రపంచం ఎంతో బావుంటుంది– అని నలుగురి చేత అనిపించుకోబడే వ్యక్తి **‘చందూ’** కథలోని చందూ.

మంచితనం ఒక దీపం వంటిది. ఆ దీపంతో మరిన్ని దీపాలు వెలిగించవచ్చునంటారు రచయిత చందూ కథలో. రోజూ బస్సు ప్రయాణంలో చందూని కలుస్తుంటుంది సాహితి. చందూ మంచితనం వల్ల సాహితీ చందూకి దగ్గరవుతుంది. ఎన్నో సందర్భాలలో చందూ కనబరిచే మంచితనం సహాయపడే తత్త్వం సాహితిని చందూకు అతి దగ్గర చేస్తుంది. సాహితి స్నేహితురాలు విజయ. విజయ భర్త ఉదయ్ మరణిస్తాడు. ఆ సందర్భాన చందూ చేసిన సాయానికి సాహితీ కొంత అసహనానికి గురి అవుతుంది. పొజెసివ్‌నెస్ భావనలు గల సాహితి మొదట కొంత అసూయ పడ్డా చందూకున్న సహాయపడే గుణం వల్ల ఆకర్షితురాలవుతుంది. కొసమెరుపు మలుపుతో చందూ పైన ఉన్న అపోహలన్నీ తొలగటంతో కథ సుఖాంతమవుతుంది.

ఇలాంటి మంచి కథే **‘సుందరం’**. కథలన్నింటా రచయిత సి.ఎన్. చంద్రశేఖర్ తన మంచి మనసును వ్యక్తం చేసారు. ప్రతి కథ వెనుక నేపధ్యంలో ఆ కథ రూపుదిద్దుకోవటానికి స్ఫూర్తి నిచ్చిన వ్యక్తులు సంఘటనలు ఇవ్వటం వల్ల వర్ధమాన రచయితలకు దారి చూపినట్లయిందని చెప్పవచ్చును.

రెండు కథా సంపుటులలో రచయిత సి.ఎన్.చంద్రశేఖర్ తనదైన ప్రత్యేక వ్యక్తిత్వము ఆలోచనలు, పాఠకులతో వంచుకోవటం బావుంది.



**– కూర చిదంబరం**
సెల్: 8639338675

# తెలుగు సాహితీవనం పదవ ప్రచురణ ‘విశ్వ సాహిత్యం’ పుస్తకావిష్కరణ




‘విశ్వ సాహిత్యం’ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

జనవరి 29న గురువారం, రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో శాంతి కృష్ణ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥ సి. మృణాళిని గ్రంథ పరిచయకర్త ఆడెపు లక్ష్మీపతి, గౌరవ అతిథులుగా, డా॥ అంపశయ్య నవీన్, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, సత్యాజీ, చెలమ చెర్ల భాస్కర్ రెడ్డి, డా కృష్ణారావు రెడ్నం, స్వాతి శ్రీపాద, డా॥ చమన్, బి. సంపత్ కుమార్, కొల్లూరి సోమశంకర్ హాజరు అయ్యారు. సభాధ్యక్షులు శాంతి కృష్ణ మాట్లాడుతూ తెలుగు సాహితీ వనం నుంచి వస్తున్న 10వ ప్రచురణ అని తెలియజేసారు. “విశ్వసాహిత్యం” అనే పేరుతో 12 నెలలు 12 మంది ప్రముఖ వ్యక్తులచే జూమ్ వేదికగా ప్రపంచ భాషల సాహిత్య పరిమళాలను మనకు అందించాలనే సదుద్దేశ్యంతో ఏనుగు నరసింహా రెడ్డి రూపకల్పన చేసారు.

గ్రంథ ఆవిష్కర్త మరియు ముఖ్య అతిథి డా॥ సి. మృణాళిని “విశ్వ సాహిత్యం” గ్రంథం గురించి మాట్లాడుతూ మనం సాహిత్యం ఎలా రాయాలో మరియు ఎలా రాయకూడదో తెలియ జేస్తుందని చెప్పారు. గ్రంథ పరిచయకర్త మాట్లాడుతూ ఈ పుస్తకంలో ఉన్న 12 ప్రపంచ ప్రసిద్ధ గ్రంథాల సాహిత్యాన్ని విపులంగా తెలియజేసారు. 12 పుస్తకాల్ని ఒకే చోటే తెలుసుకున్న అనుభూతి కలిగిస్తుందని తెలియజేసారు. సుమన ప్రణవ్ సమన్వయం చేయగా వందన సమర్పణ సుధా కల్యాణి చేశారు

## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

## ‘బుధవారం బాద్షా’ పోటీ ఫలితాలు



అడ్మిన్: **రమాదేవి కులకర్ణి**
8985613123

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ**



### పాపాల పుట్ట

ఏ గంగ కడిగేను పాపాలు...
ఏ అగ్గి కాల్చేను దుఃఖన్ని..
ఏ మొక్కు తీర్చేను
అంతర్మధనాన్ని..
చెపితే పోతాయా..
ఏడుస్తే మాయమౌతాయా...
పొరపాట్లే పాపాల..
పాపాలే పొరపాట్ల...
కంటికి,
నోటికి,
చెవులకి... తోడైన మనసుకి..
నిత్యం యుద్ధమేగా...
మనిషి అయ్యేను
పాపాల పుట్టేగా?!
అంతరాత్మ ప్రశ్నిస్తుంటే..
ప్రశ్నకు...
సమాధానం శాంతించకుంటే...
గ్రహపాటై చుట్టేసుకుంటే...
ఆ భారాన్ని... ఎన్ని జన్మలు
మోయలో...
దుఃఖన్ని
దరిచేరని దేవుడెవడున్నాడు.?
దయచూపదే కాలం..
మనశాంతికై నిత్యం పోరాటం
చివరి అంకాన చెరగలమని
మనిషి ఆరాటం
ఏ గంగ కడిగే పాపాలు.

**–వనిత్**

### నాకన్నా ఎవరు ఎక్కువ కాదు

నిజమే నేనే తోపు నాకన్నా ఎవరు ఎక్కువ కాదు.
నాకు అన్నీ తెలుసు, ఎవరితో చెప్పించుకోనవసరం లేదు.
ఆత్మాభిమానం కాదు ఇది అహంకారం!
నేనే మంత్రి నేనే రాజు!.
చేసిన తప్పులను మభ్యపెడుతూ కప్పిపుచ్చుకునేది స్వార్థం!
తానే గొప్ప తనలో తప్పులు ఎందుకుంటాయి?
అసలు తప్పులను ఎందుకు ఒప్పుకోవాలి?
అందరిలో చులకన కామా?.
రేపటినుండి ఎవరైనా తనకు విలువిస్తారా?
పురుగును చూసినట్టు చూడరూ?
అబ్బబ్బ సమస్య లేదు ఆత్మ విమర్శనా తొక్కనా?
ఆత్మ అంటూ ఉంటే కదా!.
విమర్శించుకోవడానికి?
సస్సేమిరా తప్పులను ఒప్పుకునే ప్రశ్న లేదు!
కావాలంటే ఎదుటివారితో ఎదుటి వాళ్ళ తప్పులను లెక్కిస్తాం!.
మా తప్పులు మేమేలా ఒప్పుకుంటాం?!
ఆత్మ విమర్శ అనేది ఎవరికైనా అవసరమే!
అంటారా?
మనలోని లోపాలను తెలుసుకోవడానికి
ఆత్మ విమర్శ అని కూడా అంటారా?
తప్పులను ఒప్పులుగా చూపించే మాకేమీ అవసరము?!
ఆత్మ విమర్శ అణచివేయమూ?! పాతాళానికంట.
మనసున్న వాళ్లకే ఆత్మలు ఆత్మ విమర్శలు మాకెందుకంటా?!
మావి రాతిమనసులు
మంచి చెడుల విచక్షణ మాకెందుకు?!
అసలు ఆత్మ విమర్శ పదానికి అర్థం కూడా తెలియదు!.

**–డాక్టర్ బలిజేపల్లి నాగరత్నం**
హనుమకొండ

### గుండె గుడిగంటలు

పైకి అనలేని మాటలు..
అనకూడని మాటలు..
ఊరుకోమని నోరు నొక్కేసేవి..
నీతి ప్రభోదాలు..
ఇలా చేస్తే బాగుంటుంది..
నువ్విలాగే ఉండాలి..
ఇలాగే చేయాలి..;
లోపల అనుకునేదొకటి..
పైకి పలికేదొకటి!.
పౌరాణిక సినిమాల్లో
చూపించిన..
అద్దంలోని వ్యక్తి
అంతరంగ సంభాషణలు..
సాంఘిక సినిమాల్లో చూపించిన
ఒకే వ్యక్తి రెండు రూపాలు..
ఎంత చక్కగా సంభాషణను,
సంఘర్షణను చిత్రీకరించేవారో
చివరికి మంచో..చెడో..పాత్ర..
ఒకదాని నోరు నొక్కి
బయటికి వెళ్లిపోవడం!
ప్రేక్షకులకు
చక్కగా అర్థమైపోయేది!.
నేటి సినిమాల్లో
సంఘర్షణ అనేదే లేదు..
లోపలి మనిషి పీక నొక్కి
అనుకున్నది చేసేయడమే!.
మనిషి
అంతరంగంలోని సంభాషణ..
వింటే అందలానికి..
వినకపోతే పాతాళానికి!.
ఆలకించినవాడు
మహాత్ముడౌతాడు..
పెడచెవిన :
పెట్టనివాడు పుణ్యాత్ముడౌతాడు..
పట్టించుకోనివాడు
దురాత్ముడౌతాడు!.
ప్రతి మనిషిలోని
ధర్మ దేవాలయంలో
మోగే గుడిగంటలు వినాలి..
ఆత్మవిమర్శ చేసుకోవాలి..
ధర్మ పథాన నడవాలి!


**–చంద్రకళ. దీకొండ**
మల్కాజిగిరి

### ఆత్మ విమర్శ ఒక జ్ఞానం

జీవితం లో కష్ట దుఃఖాలను
రోగాలను ఎదుర్కొనడానికి
ఆరోగ్యంగా జీవించడానికి
మనోబలం పెంచుకొనుటకు
ఆత్మ విమర్శ చేసుకోవటం ఒక శక్తి.
అందరితో కలుపుకునే భావన
ప్రేమ ఆప్యాయతలు పంచుటలో
వర్గ భేదాలను అణిచివేతకు
భిన్న అభిప్రాయాలను ఏకం కొరకు
ఆత్మ విమర్శ చేసుకోవటం
ఒక ఆయుధం.
మంచిని పెంచడంతో
మొదలు
చెడును
దూరం చేయడంతో పాటు
వసుదైవిక కుటుంబం కోసం
నిరంతర పాటు పడడం కొరకు
ఆత్మ విమర్శ చేసుకోవడం
ఒక రహస్య శక్తి.

**–శ్రీనివాస్ నూతలపాటి**
విజయవాడ

# నాయకులు 'వి'నాయకులు... వారి విలక్షణత్వం




ప్రతులకు: క్రాంతి చైతన్య ప్రచురణలు
హౌజింగ్ బోర్డు కాలనీ, ఇ.నెం. 5-7-563
పి.వి.నర్సింహారావు 6వ వీధి
కరీంనగర్-తెలంగాణ
సెల్: 8328067855

దేశ ప్రగతి, ప్రజా సంక్షే మము, దేశాన్ని పాలించే రాజుపై ఆధారపడి ఉంటుంది. నేటి కాలం లో ఈ రెండూ, ఆ దేశ నాయ కుడిపై ఆధారపడి ఉంటుంది. పాలించే ప్రభువు ననుస రించి రామరాజ్యము ఉండవచ్చును. రావణ రాజ్యము ఉండవచ్చును. అందుకే "యధా రాజా: తథా ప్రజా:" అన్నారు మన పూర్వులు.

ప్రస్తుత సమాజంలో ప్రభువులు, కండబలం, కత్తిబలంతో దేశా ను ఆక్రమించి ఏలటం పోయింది. ప్రపంచ వ్యాప్తంగా, డెమొక్రసీ అమలులోకి వచ్చింది. ఇందుకు కొద్ది దేశాలు మినహాయింపు కావొచ్చును. 'డెమొక్రసీ' పాలనలో ప్రజలే తమను పాలించే నాయ కుడిని ఎన్నుకుంటారు. ఆయన మరియు ఆయన ఏర్పరిచే మంత్రివర్గం ఒక నిర్ణీతమైన సమాయానికి దేశ పాలన చేస్తారు. నిర్ణీత సమయం గడిచిపోగానే, ప్రజలకు అదే నాయకుడిని, లేదా మరో తమకు నచ్చిన నాయకుడిని ఎన్నుకునే స్వేచ్ఛ ఉంటుంది. ప్రజలే ఎన్నుకున్న నాయకుడ వటం వల్ల ఆయన (నాయకుడు) ప్రజా విధేయుడై, ప్రజా సంక్షేమానికి పాటు పడుతాడు. దీన్నే మనం 'రాజ్యాంగం' అంటున్నాము. మొఘలులు, బ్రిటిష్ పాలన చెర నుండి విముక్తమైన మన దేశం 1950 నుండి ప్రజా పాలన అంటే ప్రజలు ఎన్నుకున్న నాయకుల పాలనలో ఉంది. 25 ఏళ్ళు ఒక 'తరం'గా భావిస్తే. మూడు తరా లుగా భారతదేశం నాయకుల పాలనలో ఉంది. మొదటి తరం నాయకులను సుపరిపాలకులు అనవచ్చును. వీరు దేశ స్వాతంత్ర్యాన్ని సాధించిన వారు. తమ సర్వస్వాన్ని దేశానికి ధారపోసారు. రెండవ తరం నాయకులు నుండి, 'డిజనరేషన్' ప్రారంభం అయింది. నాయకులు 'సొంత లాభానికి' అలవాటు పడ్డారు. దేశ సంపదను స్వలాభానికి వాడుకున్నారు. స్విస్ బ్యాంకుల్లో ఎక్కవుంట్లు, తమ బంధు మిత్రుల పేరిట బినామీ సంపాదనలకు పూనుకున్నారు. అవినీతి, అరాచకం బందు ప్రీతితో చట్టాలను చుట్టాలుగా మార్చు కున్నారు. మూడవ తరం నాయకులు కొందరు తప్ప, 'ముప్పాతిక, మువ్వీసం' నాయకులు తమ పూర్వుల అడుగు జాడల్లో నడుస్తూ, రామరాజ్యానికి పూర్తిగా వ్యతిరేకమైన సేవను అందిస్తున్నారు.

సుదర్శనం వేణుగోపాలచారి (కలం పేరు సుదర్శనం వేణుశ్రీ) అసలు సీసలైన ప్రజాకవి. ప్రజా సంక్షేమమే, తన ధ్యేయంగా నమ్ముతున్న తన కలం కాగడాతో ఆవరించిన పెంజీకటిని ప్రారద్రోలాని పరితపించే సాహితీవేత్త ఎలుగెత్తి నినదిస్తూ నేటి నాయ కుల తీరుతెన్నులను విమర్శిం చేందుకు శతక మాధ్యమాన్ని ఎన్నుకున్నారు.

**శతకము-విశిష్టత:** తెలుగు భాషా సాహిత్యంలో శతకం యొక్క ప్రత్యేకత 'ఇంతా అంత...' అని చెప్పలేము. ఎంతో.. సామా న్యజన బాహుళ్యంలో చొరబడి, పండితులకు, పామరులకూ సులభ గ్రాహ్యమై వారి దైనందిత వ్యవహారంలో భాగమై వారి నాలుకలపై నడయాడుతుంది. 'ఉప్పుకప్పురంబు నొక్క పోలికనుండు' అంటూ ఇద్దరూ పకి ఒకేలా కనబడ్డా వారి గుణాలను వేరుచేసి చూపుతాము. 'ఏరకు మీ కసుగాయలు, దూరకు మీ బంధు జనుల' అంటూ బుద్ధి గరుపుతాము. 'ఎలుక తోలు దెచ్చి ఏడాది ఉతికినా, నలుపు నలుపే కాని తెలుపు కాదు' అంటూ మానవ నైజాన్ని వ్యక్త పరుస్తాము. 'కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా' అంటూ వస్తు గుణ విశేషాన్ని వ్యక్తిగుణ బేధాల్ని- పది వాక్యాల్లో చెప్పాల్సిన 'మేటర్'ని ఒక్క వాక్యంలో ఎదుటివారికి అర్థం చేపించుతాము.

శతకము యొక్క విశిష్టత ఇంతది. కనుకనే వేమన, సుమతి, కుమారి శతకకర్తల నుండి ఇప్పటి వరకు కొన్ని వేల శతకములు తెలుగు సాహిత్యాన్ని పరిపుష్టం చేసాయి. చేస్తున్నాయి. కనుక ఈ కవి వేణుశ్రీగారు కూడా. నేటి కుహనా నాయకుల యెడ తన నిరసనను ప్రకటించేందుకు 'శతక మాధ్యమా'న్ని ఎన్నుకోవటం ఎంతో సమంజసంగా ఉంది. అందునా, సీసపద్య ఛందస్సును ఎన్నుకోవటం మరింత సమంజసంగా ఉంది. సీసపద్యాన్ని తెలుగు చందస్సులోని ఒక ముఖ్యమైన ఉపజాతి అంటారు. ఒక పెద్ద పద్యం తర్వాత ఆటవెలది లాంటి గీత పద్యం ఉంటుంది. సీస పద్యం కవులకు తమ భావాలను విస్తృతంగా రసవంతంగా చెప్పేం దుకు వీలుగా ఉంటుందని విబు ధులు నమ్ముతారు. సీసపద్యం తెలుగు సాహిత్యానికి గొప్ప అందం ఇస్తుందని నమ్మిక.

**నాయక శతకం..వేణుశ్రీ ప్రతిభ**

దుష్ట శిక్షణకు శిష్ట రక్షణకు నరసింహుని ప్రధానంగా నమ్ముతారు. ఆయన అవతరించిన కారణ మదే కద! కవి వేణుశ్రీ ఈ శతకాన్ని (కోట్లనందగిరి) నరసిం హులు పల్లె శ్రీ ప్రసన్న లక్ష్మీ నరసింహస్వామికి అంకితం చేసి దుష్ట శిక్షణ శిష్ట రక్షణకై అన్యా పదేశంగా వేడుకొంటున్నారు. సామాన్యంగా మకుటం ఒకే పాదం ఉంటుంది. వేణుశ్రీగారు **'నాయకుల గుణముల మార్చ నారసింహ/ వేగ రావయ్య భువి పైకి వేడ్కజేయ'** అంటూ రెండు పాదాలతో తన ప్రత్యేకతను చాటు కున్నారు.

నాటి నేటి నాయకుల తులనాత్మకతతో ప్రారంభించి పాలక పక్షం, ప్రతిపక్ష సభ్యులను పార్టీ లోకి లాగుకును 'నీచ పద్ధతి' నిరసిస్తారు (పద్యం:3) నరకాసుర హిరణ్యాక్షుల కంస, రావణాసుర దుర్యోధన, భస్మాసుర లక్షణాలున్న నాయకులను మార్చమంటూ నారసింహుని వేడు కుంటాడు (పే.5) విదుర భీష్మ ద్రోణు లు మౌనాన్ని వీడరంటూ, అన్యాప దేశంగా ఇతర నాయకులను ఈసడిస్తారు (పే:6) 'ధరణి' డొల్లతనము, గుట్టలు మాయమవటం, నాయకుల జీవిత కాలపు పెన్షన్ సదుపాయము, కపట వాగ్దానాలు పథకాల అమలులో అవినీతి, కంట్రాక్టరు దారుల 'కాసుకంపు' బినామీ వ్యవ హారాలు, భజనపరుల ఎత్తుగడలు, భూదం దాలు సెటిల్మెం టులు, ఓట్లను నోట్ల తో కొను గోలు, వ్యవసాయ కార్పొరే టీకరణ, విందు వినోదాలకు చేసే కోట్ల ఖర్చు, వేతనాల బకాయిలు. పెన్షనర్లకు మొండి చెయ్యి, విద్య వైద్యరంగాలు ప్రయివేటు పరం, రాష్ట్రాన్నీ దేశాన్నీ ఆర్థిక ఊబిలో దింపుటం ఉచిత పథకాలిచ్చి ప్రజల ను సోమరులుగా చేయటం మత విద్వేషాలు, కులమతాల ప్రోత్సాహం కుల సంఘ భవనాలు, గుడి భూముల ను, బడి భూములను కబ్జాలు చేయటం, పార్టీలను పదువుల కొరకు పశువుల సంతగా మార్చిన విధాయకం, పార్టీల తీరు తెన్నులు నిరసించుతారు. సాహిత్యనాటక సంస్థలలో కూడా చోటు చేసు కున్న అవినీతిని దుయ్యబట్టారు. పొగడేటి వారలె పొందగలరు/ సర్కారు శాలు వ సన్మానాలు అంటారు. అరాచ కాన్ని ఎత్తి చూపటమే కాకుండా, నాయకులు ఎలా మసలాలో 103. 105, 106, 107 పద్యాలలో చెప్పటం బావుంది. ఒక సాహితీ వేత్త విమర్శించుంటే చాలదు. మంచి దోవను చూపగల గాలి. నాయక శతకంలో వేణుశ్రీగారు ఇదే చేస్తున్నారు. మంచీ చెడుల విమర్శ, మంచి మార్గానికి దోవ చూపటం ఒక మంచి సాహిత్యకారుడి గొప్ప లక్షణం.

భాష సాహిత్యానికి సౌరభా న్నిస్తుంది. 'గీ పాలకుల బాట' (పే.4) 'చట్టములు, చుట్టములు' (11) 'వకీల్లు'(20) 'ఆడుకుం టుండ్రు', 'ఆగమవటం', 'ఎగురు తుండ్రు', (28) 'బగ్గఓట్లు' (32) 'బలగము' (32) లాంటి అచ్చ తెనుగు పదాలు వాడి పద్యాలకు పరిమళం చేకూర్చారు. నాయకుల పాదాల క్రింత నలుగుతున్నట్లుగా అట్ట మీది బొమ్మను చిత్రించటం కవి యొక్క నిబద్ధత కు నిదర్శనం.

'మరో మాగ్నా కార్టా' అని డా॥ మాదిరాజు బ్రహ్మానం దరావు, వలపు వేణువు కాదు- సమాజపు తలపు వేణువు అంటూ బహుభాషా వేత్త.

కాళోజీ అవార్డు గ్రహీత డా॥నలిమెల భాస్కర్ గారల కితాబులు.

రచయిత, ప్రతిభ పాటవానికి అద్దం పడుతున్నాయి. రచయితకు హృదయపూర్వక అభినందనలు



**- కూర చిదంబరం**
8639338675


# ప్రకృతి ప్రకోపానికి కవుల ఆవేదన 'జలవిలయం'

## (కామారెడ్డి వర్ష భీభత్సం-కవిత్వం)

ప్రకృతి ప్రజలనెప్పుడూ పరీక్షిస్తూనే ఉంటుంది. ప్రజలు కూడ పోరాడుతూనే ఉంటారు. అందులో తట్టుకొని నిలబడేవారు కొందరైతే ప్రకృతి ప్రకోపానికి గురయ్యేవారు మరికొందరు.

గతనెల ఆగస్టు చివరి వారంలో తేది27-8-2025 నాడు ప్రకృతి ప్రకోపం తారా స్థాయికి చేరింది. కనీవిని యెరు గని వర్షం. అదీ యేనాడూ చూసెరుగని కామారెడ్డి, మెదక్ జిల్లాలలో ముఖ్యంగా కామారెడ్డి, సమీపంలోని రామాయంపేట రెండు రోజులు జలదిగ్బం దనం లో ఉండిపోయిందంటే నమ్మ శక్యం కాని విషయం. అయినా జరిగింది మాత్రం నిజం. క్లౌడ్ బర్స్ట్ జరిగిన కారణాన పడిన వర్షం. శాస్త్రీయంగా చెప్పాలంటే మానవ తప్పిదాలే కారణాలని విశ్లేషకులంటున్నారు. ఏదేమైన ప్పటికి జరుగాల్సిన విపత్తు జరిగి పోయింది. పంట నష్టం, ఆస్తిన ష్టం జరిగి జనబాహుళ్యంలో ఆందోళన,అవస్థలు అనుభవించిన వైనం వర్ణనాతీతం.

ఈ సందర్భాన్ని పురస్కరించుకొని,తెలంగాణ రచయితల వేదిక కామారెడ్డి జిల్లా శాఖ స్పందించి, కవులను ప్రోత్సహించి తమ రచనల ద్వారా ప్రజలలో కారణాన్వేషణ భావాలను కలిగిం ప జేయడానికి 25 మంది కవుల కవితలు వచన, గేయ, పద్య కవితా ఖండికలతో "జలవిలయం" అనే సంకలనాన్ని ప్రచురింప జేసింది.




ప్రతులకు:
సిరిసిల్లా గఫూర్ శిక్షక్
ఇంటి.నెం.14-37,
మధురా నగర్ కాలని
దేవుని పల్లి జిల్లా.కామారెడ్డి
సెల్ 9849062038.

ఇందులో 28 కవితా ఖండిక లున్నాయి. తె.ర.వే.కామారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ సంపాదకత్వం లో,వెలువడిన ఈ పుస్తకం లో ప్రకృతి ప్రకోపం, వరదలు, రోడ్లు,వాహనాలు,ఆస్తి నష్టం ప్రజల కన్నీటి గోస,విపత్తుకు గల కారణాలు, పరిష్కారాలు సూచించబడ్డాయి. డా!! లచ్చయ్య గారి ముందు మాట చదువ దగ్గ విషయం.

వ్రాసిన ప్రతి కవిత దేనికదే ప్రత్యేకత కలిగి యున్నటువంటిది. కవుల కవితా ధోరణి కష్ట జీవుల కన్నీటి గాధను స్ఫురింపజేస్తుంది. జరిగిన విలయం కళ్ళకు గట్టినట్టే కనిపిస్తుంది.

పుస్తకం మొదటి కవితలోనే... **కామారెడ్డి లో కడలి/వెతుకులో వరదలు/మతిలేని పాలకుల / శృతిలేని రాగాలు...ఇంకా...ప్రకృతి ప్రకోపం/భూమాత తాపం...అది ప్రజలకే శాపం** అని అంటాడు కవి,కాలమిస్ట్ "శృతిలేని రాగాలు కవితలో...!"

**"పొట్టలు పగిలిన చెరువులూ**
**నీట మునిగిన పంటలు....**
**......కాలమా నువ్వు పరిచిన వలలో**
**ఎన్నెన్ని దిక్కులేని**
**అనాథ లైన ప్రాణాలు**
**గూడు చెదిరిన పక్షులు...**
**......సమయం వచ్చినప్పుడే**
**బలం చిక్కినప్పుడే**
**తన ప్రతాపం చూపిస్తుంది."**

వర్షం అని నిజాన్ని నొక్కిచెబుతాడు కవి

తన "ఆర్త నాదాలనడుమ ఆకాశం" కవితలో...!

**"ఊరేదో చెరువేదో**
**వాగేదో వంతెనేదో**
**కాలువేదో నేలయేదో**
**కనిపెట్టగ కష్టమాయె"** అంటూ

వ్రాసిన కవితలో వర్ష భీభత్సాన్ని చూపిస్తుంది.

తొలకరిలో కురిసిన వర్షం కనిపించలేదేమని ఆక్రోశిస్తే కుండపోతగా కురిపించి కల్లోలం సృష్టించనేల...? అంటూ ప్రశ్నిస్తాడు తన "వర్షాగ్రహం"పాటలో కవి.

"ప్రకృతికి ఎవరేం హాని తలపెట్టినారో..!

ప్రజలనివాసాలపైజోరువాన రూపంలో పగబట్టింది...!"అనే కవి వేదనలో మానవ తప్పిదాన్ని చెప్పకనే చెప్తున్నాడు కవి తన **"జడి వానలో జడిసిన కామారెడ్డి"** అనే కవితలో...

ఇక **"ఇది కామారెడ్డి వేదనా/ ప్రజల ఇబ్బందుల రోదనా"** అంటూ తన పాటతో వర్షం ఉగ్ర రూపాన్ని కల్లోల కామారెడ్డి వర్ష చిత్రాన్ని కళ్ళకు కట్టినట్లుగా చూపిస్తాడు కవి,గాయకుడు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ గారు.

ప్రకృతి ప్రకోపానికి గురైన కారణాలను విశ్లేషిస్తూ ....

**"అయ్యిందేదో అయ్యింది గేడికెళ్ళన్న మంచిగుందం**
**తప్పుల్ని సరిదిద్దుకుందం, మనుషులతిర్గ బతుకుదం..."** అంటూ జనహితాన్ని పల్కుతూ "ఇదేం ఆన" అనే కవితలో మన తప్పిదాన్ని ఒప్పుకుందామని హితవు బల్కుతాడు కవి.

చివరగా ఇలాంటి సందర్భాలెన్నో చూశాం.కానీ అనుభవంలోకి వచ్చాక కూడ మారిన మనసుతో బతుకుదామని, పరిష్కారం మనవంతుగా చేసుకోవాలని .....

"పరిష్కారం" పాటలో ...


**"కరువుకాలం!కష్టకాలం!**
**వరద కాలం!ముంపు కాలం!**
**అసమ వృష్టికి అంత్యకాలం**
**ఎప్పుడొచ్చును పరిష్కారం!...**

అని,మనల్ని మనం ప్రశ్నించుకోకుంటే

**"కాలమిచ్చే శిక్ష తప్పదు...**
**నీటికెప్పుడు పల్లమే యెరుకా.. .!!"**

అని పరిష్కారం వెతుక్కోవలసి ఉందని హెచ్చరిస్తాడు కవి తన "పరిష్కారం" కవితలో... ఇలా ఇందలి ప్రతి కవితా మనుషుల హృదయాన్ని ద్రవీభవిం చేలా ఉండి ఎప్పుడు ఏ ప్రాంత వాసు లయినా మున్ముందు తగిన జాగ్రతలు తీసుకుంటే ప్రకృతి విలయతాపాలనుండి కొంతైనా బయట పడగలమని విశ్వసించక మానము.

అందుకే చిన్న పొత్తాన్ని జరిగిన విపత్తుకు గుర్తుగా ప్రజలకిదో హెచ్చరికగా తీసుకొచ్చిన పుస్తకంలోని కవివర్యులు డా॥లచ్చయ్య, సిరిసిల్లా గఫూర్ శిక్షక్,అల్లి మోహన్ రాజ్, యెనిశెట్టి గంగా ప్రసాద్, మంద పీతాంబర్, బందరబోయిన శ్రీనివాస్, ఉమా శేషారావు వైద్య, వబ్బ విజయశ్రీ, కళ్ళెం నవీన్ రెడ్డి,బాయికాడి నర్సింలు, సాసుబిల్లి తిరుమల తిరుప తిరావు, కాసర్ల రామచంద్రం, కొడి రవీందర్, శ్యాం కుమార్ మౌర్య, గోల్కొండ నర్సింలు, కాశ నర్సయ్య, ఉమాదేవి, గణీబు ప్రభాకర్ రావు, తౌడబోయిన తిరుపతి, జమాల్ పూర్ రామకృష్ణ, గంగా జమున దడివె, బి.నాగభూషణం, వకుళా భరణం సుధాకర్, సుదర్శనం రాజయ్య, సంగ గౌడ్, గార్లందరినీ అభినందిస్తూ... ప్రజలకు మేలుకలుగాలని అందరూ చదువ దగ్గ పుస్తకమని అభిలశిస్తున్నాను.



**-యెనిశెట్టి గంగా ప్రసాద్**
సెల్:9866447234

పుస్తక సమీక్షలు

# అక్షర నివేదనం-గౌత్రె శ్యామల కవిత్వం

"వేదనతో అక్షరం దూరమైతే ఆవేదన పెరుగుతుంది

ఎందుకంటే అక్షరానికి బానిసను కదా" తనలో కలిగే ఆలోచనలు భావనలు అక్షర రూపాలుగా మారి కవితలై కాగితంపై ప్రవహిస్తున్నా యంటూ అక్షరం పైన తనకు గల ప్రేమని చాటుకుంది కవయిత్రి గౌత్రె శ్యామల గారు.

వృత్తిరీత్యా బ్యాంక్ మేనేజర్ గా ఎంతో మందితో కలిసి పనిచేస్తూ, బాధ్యతలతో పని ఒత్తిడితో సతమతమవుతున్నా కూడా అక్షరాన్ని ప్రేమించిన కవయిత్రి. "అక్షరమా నీకు వందనం" శీర్షికతో తన మొదటి కవితా సంపుటాన్ని వెలువరిస్తున్న సందర్భంగా కవయిత్రికి అభినందనలు.

గౌత్రె శ్యామల గారు ప్రకృతి ప్రేమికురాలు. ప్రకృతిలోని అందాలను ఆస్వాదిస్తూ పర్యావరణాన్ని కాపాడుకోవాలనే ఆలోచనలను మన ముందు ఉంచుతున్నారు.

**"స్వచ్ఛమైన గాలి ఎదను తాకగానే**
**శరీరంలో ఆహ్లాదం నిండుకొని**
**ప్రకృతి దృశ్యాలు బందీ అయి**
**కావ్యాలుగా అవతరిస్తున్నాయి"**

ఎంత గొప్పగా చెప్పింది. పొలానికి పోతుంటే అనే కవితలో దారి మధ్యలో తాను చూసిన ప్రకృతి పరిమళాలను అందంగా హృద్యంగా కవితా రూపంలో అందించింది. విద్యార్జనకై నగరానికి వెళ్లి తిరిగి వస్తున్న సందర్భంలో ...

**"నా పల్లె మట్టిలో**
**అడుగు పెడుతుంటే**
**నాకే తెలియని నవ అనురాగం**
**నన్ను హత్తుకున్నట్లనిపించింది**
**చెట్ల తొర్రల్లోని పిచ్చుకల మాటలినిపించి**
**చెవులకు వినసొంపుగా మధురంగా ఉంటే**
**నన్నే పలకరిస్తున్నాయనిపించింది"**


ప్రకృతితో మమేకమైన ఆమె మనసు పొందిన మధురమైన అనుభూతుల్ని ఇంటికి పోతుంటే కవితలో మనోహరంగా వర్ణించారు.

మనిషి తన చుట్టూ తాను గిరి గీసుకొని సంకుచిత మనస్తత్వంతో బ్రతికిన బ్రతుకు ...బ్రతుకే కాదు. అదే మనసు విశాలమై విచ్చుకుంటే

**"మానవత్వానికి మసి తొలగిపోయినట్లే**
**మనసును కమ్మిన మబ్బు వీడినట్లే**
**ప్రపంచమనే వెన్నెల వర్షంలో**
**ఆణిముత్యాలనే చినుకులు కురిసినట్లే"** యని వివరిస్తూ, వసుధైక కుటుంబం అనే భావన కలుగుతుందని సూచించారు.

ప్రకృతిలో పచ్చదనం కరువైతే బ్రతుకు బరువౌతుంది. కాలుష్య కోరల్లో చిక్కి బలైపోతాము.

**"రక్షణ కల్పిస్తే రక్షణనిస్తాయి**
**కాలుష్య నివారణకు తోడ్పడి**
**పర్యావరణ పరిరక్షణకు పాటు పడతాయి**
**మన చుట్టే మౌన నేస్తాలై ఉంటూ**
**మన సంక్షేమానికి కృషి చేస్తాయి"**




ప్రతులకు:
గౌత్రె శ్యామల
సెల్:6301081268

మొక్కల్ని పెంచడం ఎంత అవసరమో తెలియజేస్తూ మన బాధ్యతని గుర్తు చేసిన కవిత చెట్లు. చెట్లు కూడుపెట్టే నేస్తాలు , సాంత్వననిచ్చే ప్రియనేస్తాలు పర్యావరణ రక్షకులు ఆర్థిక వనరులుగా వర్ణిస్తూ

**"నా కలంతో పుడమినిండా పచ్చదనాన్ని రచిస్తాన"**ని నిండైన ఆత్మవిశ్వాసంతో కవయిత్రి చెప్పటం ప్రశంసనీయం.

**"పిల్లలు దేవుడు చల్లనివారే**
**కళ్ళ కపటమెరుగని కరుణామయులే"**

నిజమే చిన్న పిల్లలు ముద్దుగా కనిపిస్తారు. అమాయకమైన కల్మషం లేని నవ్వు. పసి పాప నవ్వులో...

**"సాంత్వన నిచ్చు స్నేహం ఉన్నది**
**మల్లె తోటలో విరబూసిన**
**పువ్వు అందం ఉన్నది**
**మలినం లేని మనసు ఉన్నది**
**స్వచ్ఛత అంటేనే గుర్తుకొచ్చే**
**స్పష్టమైన రూపం ఉన్నది"**అంటూ

చిన్న పిల్లల నవ్వులో వైవిధ్యమైన భావనలను తరచి చూసిన కవయిత్రి పరిశీలనాత్మక దృష్టిని అభినందించి తీరాలి.

**"నిన్నటిది నేడు లేదు**
**నేటిది ఈ క్షణం లేదు**
**బ్రతుకు ఎంత విచిత్రం కదా**
**ఏ క్షణం ఎలా చిత్రిస్తుందో కదా"**

జీవితం క్షణ భంగురమైనది. ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదు. అందుకే

**"గడుస్తున్న కాలమే నీది**
**బ్రతికినన్ని రోజులు సంతృప్తిగా జీవించు**
**అనునిత్యం అందరినీ ప్రేమించు**
**అనుక్షణం ఆనందం అనుభవించు"** జీవితంలోని వాస్తవికతను వివరిస్తూ ఎలా బ్రతకాలో చెప్పిన కవిత ఎంత "ఎంత చిత్రం కదా".

ఆకాశం నుండి జాలువారుతున్న వాన చినుకులు

**"ఎండిన చెట్లు చిగురుల**
**వలపులకై తపిస్తుంటే**
**ఈ వాన చినుకులు**
**సరికొత్త మెరుగులు అద్దుతున్నాయి"**
**"వేడిమికి మాడిన తనువును**
**తడిమి ముద్దాడుతుంటే**
**ఈ వాన చినుకులు**
**చల్లదనం పంచే వెన్నెలవుతున్నాయి"**
**"భూమాత గొంతు ఆరి**
**దాహార్తికై ఎదురు చూస్తుంటే**
**ఈ వాన చినుకులు**
**తాగునీటి కుళాయిల వుతున్నాయి"**

సన్నివేశం సందర్భం బట్టి వాన చినుకులను వైవిధ్యంగా పరిచయం చేసిన తీరు కవయిత్రి రచనా వైదుష్యానికి మచ్చుతునక.

**"రక్తాన్ని చెమటగా మార్చి**
**భూమాత కడుపున బంగారం పండించి**
**నా ఆకలి తీర్చే అమ్మలాంటి**
**అమృతం అతడు"** అంటూ రైతన్నకు జేజేలు పలికింది.

తన చుట్టూ జరుగుతున్న అన్యాయాలను అక్రమాలను స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను రైతుల మరణాలను ఏకరువు పెడుతూ రాసిన కవిత "మది ఘోష" .మదిలో ఆవేదన చెలరేగుతుంటే భౌతికంగా ఏమీ చేయలేకపోయినా

**"నా కన్నీటిని కలంలో సిరా చుక్కగా జేసి**
**సమాజంలో మార్పునకై కవితలుగా మలుస్తున్న "**అంటూ కవయిత్రిగా తన కర్తవ్యాన్ని చక్కగా నిర్వహించింది.

**"అమ్మ భాషలో ఆలోచించు**
**నెమలిలా**
**నీ సృజన పురి విప్పుకుంటుంది**
**పక్షిలా**
**నీ కలలు రెక్కలు తొడుగుతాయి"**

మాతృభాష గొప్పతనాన్ని తెలుపుతూ

**"అమృత జల పాతమే మన భాష**
**లేనిచో ఉంటదా మనకి శ్వాస"**

యని చాటి చెప్పారు.

దళితులకు రాజ్యాధికారం కవితలో అగ్రవర్ణాలవారి అకృత్యాలను ఆగడాలను నిరసిస్తూ

**"కులాలతో ఎందుకు శోధన**
**ముడి వేసే బంధాలకెందుకీ కుల వ్యవస్థ**
**మానవత్వం నీడలు చాలవా?"**

అంటూ ప్రశ్నించారు. దళితులకు రాజ్యాధికారం కావాలని , అందరూ ఒక్కటిగా మెలగాలని ఆశించారు.

కవయిత్రిలో కొంత స్త్రీవాద ధోరణి కన్పిస్తుంది. ఈ కవితా సంపుటిలో ఓ మహిళా మేలుకో ,మహిళా లోకమా, ఓ స్త్రీ, నారీ జనానికి నీరాజనాలు,కదలిరా కదలిరా ఐదు కవితలను అందించడమే ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తుంది.

**"రక్షణ కవచం నీకు నువ్వే**
**ఏర్పాటు చేసుకో**
**అవసరమైతే తిరగబడు**
**ఎవరో వస్తారని ఎదురు చూడకు.**
**స్త్రీ అంటే ఓ శక్తి అని**
**సృష్టికే ప్రతి సృష్టి అని చాటి చెప్పు"** మని, "స్త్రీ శక్తి స్వరూపిణి యని, ఎందులోనూ వెనుకాడదం''టూ మహిళలను మేల్కొల్పారు.

మహిళా లోకమా కవితలో

**"ఈ జగమంతా నీమయమే**
**నువ్వు లేకుంటే అంతా శూన్యమే"** అలాగే ఓ స్త్రీ కవితలో

దైనందిన జీవితంలో విభిన్న రూపాల్లో అగుపిం చే స్త్రీ రూపాలను, "నారీ జనానికి నీరాజనాలు" కవితలో "భూమికై, భుక్తికై, విముక్తికై పోరాడిన వీర వనితల"ను కవిత్వాంశాలుగా తీసుకు ని స్త్రీని ఉన్నతంగా దర్శింపజేశారు.

**"నీ తలరాత మారాలన్న**
**నీ ఊహలు ఆశలై కదలాలన్నా**
**ఆశలు నిజమై నిలవాలన్నా**
**నీ చేతుల్లోనే ఉంది అద్భుత అస్త్రం**
**నీ చేతుల్లోనే ఉంది జాతి మనుగడ**
**వెయ్యరా నీ ఓటు మంచి నాయకుడికి**
**పునాది వేయరా నవ సమాజ నిర్మాణానికి"** జాతి భవిష్యత్తును నిర్ణయించే ఓటును సక్రమంగా వినియోగించుకోవాలని యువతకు పిలుపునిచ్చారు.

**"'కులమతాలు వెతకనిది**
**పేద ధనిక పెద్ద చిన్న**
**తారతమ్యం చూడనిది**
**స్త్రీ పురుష భేదం లేనిది**
**మంచిని కోరేది**
**అమ్మలా ప్రేమను పంచేది**
**నాన్నలా ఓదార్పునిచ్చేది"** స్నేహమని , స్నేహానికి ఎల్లలు లేవని జాతి మత విభేదాలు లేవని నిర్వచించారు.

భౌతికంగా దూరమైన బంధం మనసును ముడి పెడుతున్న ఆ బంధం అందించిన మానసిక స్థైర్యంతో తనని తాను ఏ విధంగా మలుచుకుందో తెలిపే కవిత నా సూర్యుడు అస్తమించాడు. బంధాలు దూరమైనంత మాత్రాన మన జీవితం ఆగిపోకూడదు.ఆ వ్యక్తి నుండి పొందిన స్ఫూర్తిని ఆలంబనగా చేసుకొని ముందుకు సాగాలని తెలిపిన అద్భుతమైన కవిత ఇది.

కరోనా వైరస్ తో ప్రపంచమంతా అల్లకల్లోలం అయింది. ఆ సమయంలో మన భారతదేశంలో కరోనా సృష్టించిన ప్రళయంలో ప్రాణాలకు తెగించి ప్రజల క్షేమం కోసం పాటుపడిన వైద్యులు, పోలీసులు మరియు పారిశుద్ధ్య కార్మికులు చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతాపూర్వకంగా వారికి "సేవకా నీకు సలాం" కవితలో కృతజ్ఞతాక్షరాంజలి సమర్పించారు.

ఇంకా ఈ సంపుటిలో "సత్య అహింసలే నా సిద్ధాంతాలన్న ఆధ్యాత్మిక యోగివి నీవు" అంటూ మహాత్మా గాంధీని, "సాహిత్య విలువల రుచి చూపిన సాహిత్య పిపాసి విశ్వ కవి " ఠాగూర్ ను , ''అగ్నిధారను కురిపించిన విప్లవ కవి" దాశరథిని స్మరిస్తూ స్మృతి కవిత్వం అందించారు.

కవయిత్రి గౌత్రె శ్యామల గారిలో ప్రకృతి ఆరాధన ఉన్నది. సామాజిక సమస్యల పట్ల అవగాహన ఉన్నది. దేశం పట్ల అమితమైన దేశభక్తి మరియు తాత్విక చింతన, మానవతా విలువలు, స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలు అక్రమాలు అత్యాచారాలపై విరుచు కుపడే స్వభావంతో పాటు ఆర్ద్రమైన మన సు ఉన్నది. సత్వరమే స్పందించే గుణం ఉన్నది. అక్షరమా నీకు వందనంతో ప్రారంభమైన ఆమె రచన ప్రస్థానం మరిన్ని పుస్తక ప్రచురణలతో ముందుకు సాగాలని కోరుకుందాం.



**-డా॥వైరాగ్యం ప్రభాకర్**
9014559059

# తెలుగు గజల్


ఎన్నోమెట్లు ఎక్కివస్తేనే ఈశిఖరం అందుకున్నాను
ఎన్నోమార్లు ప్రయత్నిస్తేనే ఈవిజయం అందుకున్నాను.

పడిలేచే కెరటాన్నిచూడు ప్రయత్నం ఎలాచేయాలో
అలసిపోకా ఆగిపోకా ఈతీరం అందుకున్నాను.

అడ్డంకులు ఛేధించాను అనుకున్నదే సాధించాను
సడలని సంకల్పంతో ఈఅందలం అందుకున్నాను

నిరాశ పరిచేవారు ఎప్పుడూ ఉంటారని తెలుసు
ఆశనే నమ్ముకున్నాను ఈగమ్యం అందుకున్నాను

మస్తిష్కం మహాసముద్రం మధిస్తూనే ఉండాలోయి
మధించి మధించీ దేవా! ఈఅమృతం అందుకున్నాను



**- బూర దేవానందం**
8143589789

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1687వ రోజు **'కొరియర్ బాయ్'** అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'కొరియర్ బాయ్' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం.

-సంపాదకులు

**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**



అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## ఆశల పల్లకీ

భూమి పరిభ్రమణంలా
తన కార్యాలయం చుట్టూ
మూడు వందల అరవై డిగ్రీలు
మనకోసం తిరుగుతుంటాడు.
ఒకప్పుడు పోస్ట్ మాన్ లు
మాత్రమే ఉండేవారు
గ్లోబలైసేషన్ లిబరలైజేషన్
తదుపరి
అంతులేని
అవకాశాల రంగమది.
ఉత్తరాలనుండి మొదలై
వస్తు రవాణా అందుకుని
నేడు తినుబండారాలకు
మందులకు కూడా పాకింది.
పెరిగిన పట్టణీకరణ జనాభా
అవసరాలకే కాకుండా పల్లెలకు
కూడా చేరుకుంది
పైసా మే హై పరమాత్మలా
తేడానే లేదు....
అన్ని కాలాల కష్టాలను భరిస్తూ
కష్టమర్ల ఆనందాలను
మూట కట్టుకుని
ఆశల పల్లకిని మోసుకుని
రయ్యి రయ్యి మని
దూరిపోతాడు.
ఆపద సమయాల అంబులెన్సు
అగ్నిమాపక యంత్రాలకన్నా
వేగంగా
అతి తక్కువ కాలంలో
అందించే వాయువేగ గరుడ
గమన.
పేరు తెలియకపోయినా
పేగు బంధంలా అన్నీ
మోసుకొచ్చి
ఆకలి తీర్చుతున్నాడు
ఆపదలను తీర్చుతున్నాడు.
స్వావలంబనల సైనికుడు
స్వీయ క్రమశిక్షణల సిపాయి
పని ఏదైనా సరే పట్టుకుని
నిమిషాలలో
ముందు వాలతాడు.

-నగునూరి రాజన్న

## పోస్ట్ మాన్ రూపాంతరం

దూరాన ఉన్న బంధుమిత్రులు
పంపించే సమాచారాన్ని
ఉత్తరాల మూటను భుజాన వేసుకొని
మండే ఎండ నిప్పులు కక్కినా
కురిసే వాన కుదించినా
మందిలో ఈది
గల్లీలో తేలి
గస్తీ గస్తీ తిరిగి
చిరునామా కనిపెట్టి
మోసుకొచ్చిన ఉత్తరాల ఊసులను
అప్పజెప్పుతాడు కొరియర్ బాయ్
ముసలి తల్లిదండ్రులకు
అందవలసిన మందుల పైకం
ప్రేయసీ ప్రియులు ఇచ్చి పుచ్చుకునే
మనసు మతులబుల బహుమతులు
విద్యా ఉద్యోగ వేటలో
పొలిమేర దాటిన పోరగాళ్ల
మంచి చెడుల ముచ్చట్లు
ఆత్మీయత అనురాగాల
ముచ్చట్ల మూటలను
పుట్టిన రోజులకు
పెండ్లి రోజులకు బహుమతులు
కూడా
సమాచారం నిండిన కవరును
ఉత్తరం అంతరంగంలో
ఏముందో తెలియక పోయినా
కవరు మీద ఉన్నా
చిరునామాను
ఫోన్ నెంబర్ల ఆధారంగా
వెతికి పట్టుకొని
పెద్ద పెద్ద
బంగళాలలోకి పోతే
వివరాలు గేటు ముందే
అప్పజెప్పి
ఆకాశాన్ని తాకే
భవనానికైనా ఎక్కి
పట్టుకున్న చిరునామాలో
తెచ్చిన వస్తువు
అక్షర
ఉత్తరాన్ని అప్పజెప్పుతుంటే
ఆలస్యం అయిందని తిట్టే
తిట్లు
సమాచారం కోసం
ఎదురుచూసే చూపులు
కొరియర్ అందగానే
ఆనంద పడే మనుషులను
రకరకాల
సమస్యలను అనుభవిస్తూ
ఉద్యోగ బా
ధ్యతలను స్వీకరించే అతడే
కొరియర్ బాయ్.
కొరియర్ బాయ్సే కాదు
కొరియర్ గాల్స్ కూడా
ఉన్నారు
పొట్ట కూటికోసం
మోస్తున్నారు
ఉత్తరాల బస్తాలను
వేగంగా పోతుంది కొరియర్
బ్రేకులు లేని బండి
కొరియర్.

-పొన్నాల ధనమ్మ

## మన కోర్కెల సారథి

'మీ ఇంటికి
ఈరోజు బాయ్ రాలేదే!"
పక్కింటి ప్రవీణ ఆశ్చర్య భాషణం.
"అదే చూస్తున్నా
ఆవకాయకు ఆర్డర్ పెట్టా"
అమృత ఆత్రుత
సూర్యచంద్రుడు రాకపోయినా
చురుక్కు మనదు
కానీ కొరియర్
కుర్రాడి దర్శనం
కరువైతే
కొరుకుడు పడదు
అన్నం మెతుకు.
పేపర్ బాయ్
కొరియర్ బాయ్
అబ్బాయిలకై సృష్టింపబడ్డ
బడా జాబ్స్.
అరిగిపోయిన చెప్పులతో
కరిగిపోయిన కలలతో
కారుతున్న చెమటతో
గడప పూజలు చేసుకుంటూ
గడిచిపోతున్న జీవితాన్ని
నెమరు వేసుకుంటూ
అందరికీ అన్ని అందిస్తూ
తనకు అందులో
ఏవీ అందవని అర్థమైనా
ఆవేదనకు
అడ్డుకట్ట వేసుకుంటూ
అటు ఇటురోజంతా
ఫుట్ బాల్ లా
ఓనర్ తనతో ఆడుకుంటున్నా
ఆట ఆపమనడానికి
అవకాశం లేని అభాగ్య జీవి
అందుకే
అతని జీవితం ఒక రణరంగం.

-డా.సి వసుంధర

## ఓ హెడ్ లైన్

కొరియర్ బాయ్
పేరు లేని కథ
చిరునామా లేని జీవితం
చేతిలో పార్సెల్
హృదయంలో వేల చిరునామాలు
అతడో హెడ్ లైన్.
ప్రతి ఉదయం సూర్యుడితో
పోటీగా బయలుదేరతాడు
రెక్కలేని పక్షిలా
చక్రాల మీద ఆశను మోస్తూ.
అతని బైక్ శబ్దంలో
పట్టణపు గుండె చప్పుడు
అతడో తెలియని రాయబారి.
ట్రాఫిక్ సంకేతాల మధ్య
తన సమయాన్ని
చీల్చుకుంటూ వెళ్తాడు.
ఎత్తైన అపార్ట్‌మెంట్ల నీడల్లో
చిన్న మనిషిగా కనిపించినా
అతని చేతిలో ఉన్న పార్సెల్‌లో
ఎవరో ఒకరి ప్రపంచమే
దాగి ఉంటుంది.
ఎక్కడో ఒక ఇంట్లో
అమ్మ చేతులు కంపిస్తూ
ఎదురుచూస్తుంటాయి,
మరెక్కడో
ప్రియుడి ఊపిరి ఆగి ఉంటుంది.
ఆ ఊపిరిని తీసుకెళ్లే వాడే
ఈ కొరియర్ బాయ్.
అతడే హెడ్ లైన్.
అతడు తెచ్చేది
కేవలం వస్తువులు కాదు-
విశ్వాసం, ఎదురుచూపు
విరహానికి సమాధానం
కొన్నిసార్లు
నిశ్శబ్దానికి ఓ ఉత్తరం
ఎండలో చెమట అతని సంతకం
వర్షంలో తడిచిన బట్టలే
అతని గుర్తింపు కార్డు
ప్రతి మనిషిని పలుకరించే
రివార్డ్.
ఆకలి తెలిసినా
ఆగలేదు
డెలివరీ టైం దాటితే
ఆశలే ఆలస్యం అవుతాయి.
లిఫ్ట్ పనిచేయకపోతే
మెట్లు ఎక్కుతాడు
కృతజ్ఞత లేకపోయినా
తల వంచి "సార్" అంటాడు.
ఎందుకంటే
అతని ఉద్యోగం
తల వంచడమే కాదు-
బాధ్యతను నెత్తిన పెట్టుకోవడం.
అతడో సగటు మనిషి
పండుగ రోజుల్లో
ఇతరుల ఆనందానికి
చిరునామా అవుతాడు,
తన ఇంటి దీపం
ఎప్పుడో వెలుగుతుందో
తనకే తెలియదు
పత్రికల మొదటి పేజీల్లో
అతని ఫోటో ఉండదు
అయినా
రోజూ వేల జీవితాల్లో
అతడే హెడ్‌లైన్.
రేపటి కలలు
పార్సెల్‌లో పెట్టుకుని
ఈరోజును దాటే వాడు
మన కాలానికి నిజమైన కవిత
ఈ కొరియర్ బాయ్.
మనసెరిగిన మరో మనిషి
అతడే అందరికి హెడ్ లైన్.

-గుండవరం కొండల్ రావు

## నిశ్శబ్ద సేవ

ఉదయమే
పుట్టే సూర్యుడితో పాటు
రోడ్డెక్కే నిశ్శబ్ద యోధుడు అతడు
హెల్మెట్ లో దాగిన
చెమట చుక్కల్లో
బాధ్యతల బరువు మోసే
కొరియర్ బాయ్
చిరునామా కోసం చుట్టే గల్లీలు
తెలియని తలుపులే అతని లోకం
ఒక ప్యాకెట్ లో దాగిన ఆశలు
అందించడమే అతని ప్రతిజ్ఞ
వాన పడితే వానతో పోరాడి
ఎండ మండితే ఎండను భరించి
సమయానికి చేరాలనే ధ్యేయంతో
గడియారాన్ని మించిన
వేగం అతనిది
ఎవరికో పుట్టినరోజు ఆనందం
ఇంకెవరికో మందుల ప్రాణం
మరొకరికో ఉద్యోగ కలల మొదలు
అన్నీ అతని చేతుల్లో ప్రయాణమే.
లిఫ్ట్ లేని అంతస్తులెక్కి
తలుపు తట్టే వినయం అతనిది,
"సర్? మేడం?" అన్న మాటలోనే
గౌరవం పలికించే శ్రమజీవి అతడు.
కొన్నిసార్లు చిరునవ్వు బహుమానం
కొన్నిసార్లు నిర్లక్ష్యమే ప్రతిఫలం
అయినా కోపం దాచుకుని
కర్తవ్యానికే కట్టుబడి నడిచేవాడు
నగరపు గుండెల్లో నాడిలా
పరుగులు తీసే నిరంతర శబ్దం
ఆన్‌లైన్ ప్రపంచానికి వెన్నెముకగా
నిలిచిన నమ్మకం కొరియర్ బాయ్.
పెద్ద పెద్ద భవనాల నీడలో
తన కలలను దాచుకున్నాడు
ఈ రోజు ప్యాకెట్ మోస్తూ
రేపటి భవిష్యత్తు మోస్తున్నాడు
అతని పేరు
మనకు గుర్తుండకపోయినా
అతని శ్రమ మన జీవితంలో ఉంది
ప్రతి తలుపు తెరుచుకున్నప్పుడు
గౌరవంతో తలవంచాలి అతనికి
ప్యాకెట్ కాదు అతడు తెచ్చేది
సమయం, సేవ, నిజాయితీ
మన సౌకర్యం కోసం సాగే
నిశ్శబ్ద సేవే కొరియర్ బాయ్.

-వి.సంధ్యారాణి

## నిశ్శబ్ద యోధుడు

గుప్పెడు మెతుకులకై
పొట్టచేతపట్టుకొని
బండెడు పొట్లాలను
వీపుకు కట్టుకొని
అస్తమించని సూర్యునిలా
ప్రయాసతో
ఆయాసపు దారులవెంబడి
పగలనక రేయనక
పరిగెత్తే దారులలో
వాన తుంపరలు
వాయు రేణువులు
వణికించే చలి
అన్నీ అతని చెమటతో స్నేహం చేసి
శ్రమను ముద్రించబడ్డ
జీవితంగా అవతరిస్తాయి.
ప్రతి పొట్లం
ప్రతి లేఖ
సమాజానికి చిన్న అవసరమే
కానీ అతనికి అది
ఒక పెద్ద బాధ్యత
ఛీత్కారాల సత్కారాలతో
స్వకార్యాలకు దూరంగా
ప్రతి అడుగునూ
జీవిత పాఠంగా మలచుకొంటూ
ఏ మలుపులో
ఏ మృత్యువు ఎదురుచూసినా
కీచక కష్టాలను తట్టుకుంటూ
వెళ్ళే మార్గంలో
ప్రతి గతుకూ
ప్రతి మలుపూ
అతని ప్రయాణానికి
సాక్ష్యమై నిలుస్తాయి.
అతను కేవలం ఉద్యోగి కాదు
తలుపు తట్టిమరీ పలకరించే
తెలియని ఆత్మీయుడతడు
ఆకలితో తను వగరుస్తూ
అమ్మలా మన ఆకలిని తీరుస్తూ
సమాజానికి ఓ నిశ్శబ్ద సాక్షి
తరచి చూస్తే
ప్రతి అడుగూ
ప్రతి పొట్లమూ ప్రతి లేఖా
అతని గొప్పతనానికి మౌన ప్రతీక.
తక్కువ వేతనం
ఎక్కువ శ్రమ
అయినా అతని ప్రతి ప్రయత్నం
అసామాన్యాన్ని అధిగమించి
అవమానాలను
అవకాశాలుగా మలచుకొని
అతని ప్రతి అడుగు
ఆత్మవిశ్వాసంతో
" సంకల్పమే శక్తి,
శ్రమయే మహాత్మ్యం"
అంటూ ముందుకు పడుతుంది.

-నాగరాజు చుండూరి

## తెలంగాణ పోరాట యోధుడు గద్దర్



సభలో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతిశర్మ. చిత్రంలో కళా జనార్ధనమూర్తి, పొత్తూరి సుబ్బారావు తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలంగాణ పోరాట యోధుడు గద్దర్ అని విశ్రాంత న్యాయమూర్తి నాగమారుతి శర్మ అన్నారు. శనివారం త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో 'గద్దర్ యాది'లో శీర్షికతో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రజలను తన ఆట పాటలతో చైతన్య పరిచిన మహనీయుడన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి, ప్రముఖులు పొత్తూరి సుబ్బారావు, భవాని శ్రీనివాస్, ప్రశాంత్,ఆంజనేయులు, కృష్ణజవహర్ పాల్గొన్నారు.

## ఉగాది బాలల కథల పోటీ- విద్యార్థుల రచనలకు ఆహ్వానం

హైదరాబాద్, ఫిబ్రవరి 4: తెలుగు నూతన సంవత్సరం ఉగాది పర్వదిన సందర్భంగా బాలల్లో సాహిత్య అభిరుచి పెంపొందించి, తద్వారా వారిలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయాలనే ఉదేశ్యం తో సిద్దిపేట జిల్లా లోని ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశా లల్లో చదువుచున్న విద్యార్థు లనుండి కథలను ఆహ్వానిస్తు న్నామని సుగుణ సాహితి సమితి కన్వీనర్ భైతి దుర్గయ్య ఒక ప్రకటన లో తెలిపారు.

ప్రథమ బహుమతి 15 00 రూపాయలు, రెండు ద్వితీయ బహుమతులు 1000 రూపాయలు చొప్పు న, మూడు తృతీయ బహు మతులు500 రూపాయలు చొప్పున మరియు 300 రూపా యలు చొప్పున 16 ప్రత్యేక బహు మతులను ఉస్మానియా విశ్వవి ద్యాలయం విశ్రాంత ఆచార్యులు మర్పడగ చెన్నకృష్ణారెడ్డి అందిస్తు న్నారు.


హామీ పత్రంతో పాటు విద్యార్థులు తాము వ్రాసిన కథలను "కన్వీనర్, ఉగాది కథల పోటీ, ప్రతిభ డిగ్రీ కళాశాల, మెదక్ రోడ్ సిద్ధిపేట-502103 చిరునా మాకు 2026 **ఫిబ్రవరి, 20వ** తేదీలోగా స్వయంగా, రిజిస్టర్ పోస్టు లేదా కొరియర్ ద్వారా పం పగలరు. పూర్తి వివరాలకు 9959 00 7914 సెల్ నంబర్ లో సం ప్రదించవచ్చునని భైతి దుర్గయ్య తెలిపారు.

## గుండె సవ్వడి

నాకు శిథిలాలంటే చాలా ఇష్టం
నిజాలన్నీ అక్కడే నిక్షిప్తం
ఎవరి కూల్చివేతో తెలియదు కానీ
వాటి గుండె ఇంకా ఆడుతోంది
చరిత్ర సవ్వడిని గట్టిగా వినిపిస్తూ.

-డా॥ కె.జి.వేణు
9848070084






## వేటూరి పాటల్లో ప్రకృతి, మానవత్వం



రూపాదేవి, అజయ్‌కుమార్‌ను సత్కరిస్తున్న అతిథులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4: వేటూరి సుందరరామ్మూర్తి పాటల్లో ప్రకృతి, మానవత్వం ఉంటాయని ప్రముఖ సినీ దర్శకుడు అజయ్‌కుమార్ అన్నారు. కళానిలయం ఆధ్వర్యంలో శుక్రవారం త్యాగరాయ గానసభలో ప్రముఖ నటుడు శోభన్‌బాబు, సినీ గేయ రచయిత వేటూరి సుందరరామ్మూర్తి జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మాజీ మంత్రి డా॥ ఎన్. వేణుగోపాలచారి ఈ సందర్భంగా ప్రముఖ నటి రూపాదేవిని శోభన్‌బాబు అవార్డుతో, అజయ్‌కుమార్‌ను వేటూరి అవార్డుతో సత్కరించారు. రూపాదేవి మాట్లాడుతూ శోభన్‌బాబు అందాల నటుడే కాదు మనసు, ప్రవర్తన కూడా సున్నితం అన్నారు. సాహితీవేత్త హైమావతీ భీమన్న అధ్యక్షత వహించిన సభలో వంశీ రామరాజు, సుంకర సత్యనారాయణ, దైవజ్ఞశర్మ, ఎం.వి.రావు, రామకృష్ణ, వీరభోగ వసంతరాయలు, పుష్పలత, సురేందర్ పాల్గొన్నారు.

తొలుత అను సిస్టర్స్ పాటలు పాడారు.

## ఆకట్టుకున్న ఓ పాట.. ఓ పద్యం కార్యక్రమం



లోకం కృష్ణయ్యను సన్మానిస్తున్న చంద్రతేజ తదితరులు.

హైదరాబాద్, ఫిబ్రవరి 4: పద్మభూషణ్ అవార్డు గ్రహీత డా॥ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డికి చెందిన శాంతావసంత ట్రస్ట్ సమర్పణలో చంద్రతేజాలయ మ్యూజిక్ అకాడమీ నిర్వహించిన ఓ పాట ఓ పద్యం కార్యక్రమం ఆకట్టుకుంది. త్యాగరాయ గానసభలో శుక్ర వారం జరిగిన ఈ కార్యక్రమంలో సైక్-సిద్ధార్థ మూవీ ఫేమ్ గాయ కుడు చంద్రతేజ, లలితారావు, జ్యోత్స్న, లక్ష్మి, శకుంతల, టీవీరావు, సినీగీతాలు ఆలపించారు. శ్రీ కృష్ణతులాభారంలోని పద్యాలను చంద్రతేజ గానం చేశారు. పద్యాలు, పాటలకు ప్రేక్షకులు హర్షధ్వానాలు చేశారు. ఈ సందర్భంగా ఆరాధన సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్యను సన్మానించారు.



జనవరి 27న కళా సుబ్బారావు కళావేదికలో ప్రముఖ సాహితీవేత్త డా॥ ఏనుగు నరసింహారెడ్డి ఐ.ఏ.ఎస్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా ఆత్మీయ సత్కారం చేస్తున్న అతిథులు ఎ. సురేందర్, కళా జనార్ధనమూర్తి, తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారులు డా॥కె.వి.రమణాచారి, బైస దేవదాసు, రాయప్రోలు వెంకటరమణ.

## జనాదరణ పొందిన కావ్యం నిలబడుతుంది- డా॥నందిని సిధారెడ్డి



రచయిత్రి వాసరచెట్ల జయంతి రచించిన తొలి కథా సంపుటి 'శర్వమ్మ మరణం' పుస్తకావిష్కరణ ఒద్దిరాజు ప్రవీణ్, డా॥ నాళేశ్వరం శంకరం, జ్వలిత, డా॥ నందిని సిదారెడ్డి, రచయిత్రి వాసరచెట్ల జయంతి, డా॥నామోజు బాలాచారి తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 4: రచయిత్రి వాసరచెట్ల జయంతి రచించిన తొలి కథా సంపుటి 'శర్వమ్మ మరణం' పుస్తకావిష్కరణ రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షులు డా॥ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ...ఏకావ్యమైతే జనాదరణ పొందుతుందో ఆ కావ్యం నిలబడుతుందని అన్నారు .తెలంగాణ సమాజాన్ని ముఖ్యంగా పాలమూరు జిల్లా యొక్క మార్క్ ఆమె రచనలో కనిపిస్తుంది. ప్రస్తుత సమాజంలోని మానవ బంధాలు ఎలా విచ్ఛిన్నమవుతున్నయో ఎలా కాపాడుకోవాలో జయంతి తన కథల్లో చెప్పారు.ఆవిష్కరణ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత్రి శ్రీమతి జ్వలిత మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వెలుగు చూసిన బీసీ కవయిత్రి వాసరచెట్ల జయంతి. జయంతి తొలి కథా సంపుటిలో ఆడపిల్లల పేర్లు నందన, నైమిష, రేవతి, శర్వమ్మ అన్నీ కొత్తగా ఉన్నాయి.కథలన్నీ మధ్య తరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబ నేపథ్యంలో నడిచాయి. అంతరించిపోతున్న మానవీయ, కుటుంబ సంబంధాల ఇతివృత్తా లే ఈ కథలు. కథల్లో చేతివృత్తుల కులవృత్తుల గురించి అందులో ఉన్న ఇబ్బందుల గురించి చర్చించడం జరిగిం ది.''ఆధునికత అంటే మోడరన్ డ్రెస్సులు వేసుకొని తిరగడమే అనుకుంటారు అందరూ. అలా కాదు నేర్చుకున్న చదువు ఆధునిక పద్ధతులను తన పుట్టి పెరిగిన ఊరికి పెట్టుబడి పెట్టాలనుకుంది" (కట్టుబాట్లు కథ) వంటి పాత్రోచితమైన సంభాషణలు పాఠకులను ఆకర్షిస్తాయి. ప్రముఖ కవి డాక్టర్ నాళేశ్వరం శంకరం మాట్లాడుతూ శర్వమ్మ మరణం కథా సంపుటి లో ఉన్న మొత్తం కథలను చదివితే ఇందులో స్త్రీ అస్తిత్వానికి సంబంధించిన కథలున్నాయి, కుటుంబం లో ఆర్థిక స్వేచ్ఛ ను మరియు స్త్రీ సాధికారతను కాంక్షించే కథలు, సంస్కరణ కథలు, మానవీయ కథలు, ఆదర్శ కథలు ఉన్నాయన్నారు. నామోజు బాలాచారి గారు మాట్లాడుతూ జయంతి రాసిన కథల్లో వస్తువైవిధ్యం ఉంది. సాహిత్య సృజనలో కవిత్వం,నవలతో పాటు కథా రచన ప్రక్రియలతో వేగంగా ప్రయాణం చేస్తున్న జయంతిని అభినందిస్తున్నా...శర్వమ్మ మరణం కథల సంపుటి ఒక వైవిధ్య భరితమైన కథా సంకలనం.. వర్తమాన సామాజికాంశాలపై సునిశితమైన సూక్ష్మ దృష్టితో రాసిన కథనాలు...వీరి రచనలో సమస్యా విశ్లేషణతో పాటు ఒక పరిష్కారం కూడా ఉండటం ఒక ప్రత్యేకత..కథా నిర్మాణం కూడా చాలా సరళంగా చెప్పదలుచుకున్న విషయాన్ని సూటిగా చెబుతూ కథను నడిపిస్తారు..

డాక్టర్ తంగెళ్ళ శ్రీదేవి పుస్తక విశ్లేషణ చేస్తూ రచయిత్రిగా జయంతి వాసరచెట్ల పాఠకుల హృదయానికి చేరువయ్యే కథల్ని సృజించింది. ఇందులో కొన్ని కథలు కథ ముగిసిన తర్వాత కూడా మనసును వెంటాడుతాయి. రాసిన ప్రతి కథలో ఒక అర్థాన్ని లేదా ఒక సందేశాన్ని లేదా ఒక పరమార్థాన్ని అందించిన జయంతి రచయిత్రిగా ఈ కథల ద్వారా తన పరిపూర్ణత ప్రదర్శించింది అని చెప్పవచ్చు .జయంతి కథల్లో సమస్త జీవన విలువలు కనిపిస్తున్న ప్పటికీ , పాత్రలన్నీ మన ఇరుగు పొరుగు వ్యక్తులుగా మనసుకు పరిచయం అవుతు న్నప్పటికి, కథల్లో పాలమూరు ప్రాంతీయ జీవన విధానానికి పెద్ద పీట వేసింది. అట్లాగే కథా సందర్భాన్ని అనుసరించి కులాలు - కులవృత్తుల్ని కూడా ప్రవేశపెట్టింది అని వివరించారు.యువకవి నర్రా ప్రవీణ్ రెడ్డి పుస్తకం విశ్లేషణ చేస్తూ నేటి కాలంలోని యువతీయువకులు తప్పకుండా చదవాల్సిన కథలు.శిథిలమైపోతున్న బంధుత్వాలు, మానవ సంబంధాలను ఈ కథలు చిత్రించాయని, మోడ్రన్ వస్తువుతో సమాజానికి అవసరమైన కథలు రాశారని అన్నారు. మహిళా సాధికారతను ప్రస్ఫుటించే కథలు, యువతులకు ధైర్యాన్ని నింపిపోసే కథలు ఇందులో స్ఫూర్తిని నింపేవిగా ఉన్నాయన్నారు. తెలుగు కథా సాహిత్యంలో మానవ సంబంధాలను బలంగా చిత్రించిన రచయిత్రులలో జయంతి నిలుస్తుందని తెలిపారు.

అలాగే శర్వమ్మ మరణం కథా సంపుటి రచయిత్రి వాసరచెట్ల జయంతి బాల్యం లో చదువుకున్న పాలమూరు జిల్లా భూతప్పూర్ మండలం లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వారితో పాటు చదువుకున్న బాల్య స్నేహితులు కూడా హాజరుకావడం విశేషం. కార్యాక్ర మానికి సమన్వయకర్త గా ప్రముఖ కవి ఒద్దిరాజు ప్రవీణ్ వ్యవహ రించగా కుమారి వి.జి .చందన వందన సమర్పణ చేశారు.



శనివారం రవీంద్రభారతిలో తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో గంటా మనోహర్ రెడ్డి రచించిన ఘంటారావం పుస్తక పరిచయ సభ మరియు తెలుగు భాషా చైతన్య సమితి నూతన క్యాలెండర్ ఆవిష్కరణ మహోత్సవంలో ఘంటా మనోహర్ రెడ్డి, ఆచార్య టీ. గౌరీశంకర్, డా॥ నామోజు బాలాచారి, బడేసాబ్, ఆచార్య జయరాములు, రాధా కుసుమ తదితరులు



జనవరి 27న కళా సుబ్బారావు కళావేదికలో 'ఫణి భార్గవ్ యాది...." కార్యక్రమంలో కూచిపూడి నృత్యాలు ప్రదర్శించిన నాట్య గురువు శ్రీమతి ప్రవల్లిక శిష్య బృందంతో అతిథులు, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, శ్రీమతి ప్రవల్లిక, డా॥కె.వి.రమణాచారి, డా॥యం.కె.రాము, కళా జనార్ధనమూర్తి.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com